



మన
# జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక

MJP NEWS TELUGU

సంపుటి : 6 సంచిక : 111 పేజీలు : 8 వెల : రూ.2/- సోమవారం 18 మే 2026 వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool




## ఆక్వా, పొగాకు రైతులను ఆదుకోండి..

ఆక్వా, పొగాకు రైతుల సమస్యలపై కేంద్రానికి సీఎం చంద్రబాబు లేఖలు

రొయ్యల మేత ధరల పెరుగుదలపై జోక్యం చేసుకోవాలని వినతి

సిగరెట్లపై పెంచిన పన్నులను పునఃసమీక్షించాలని అభ్యర్థన

మేత ధరల నియంత్రణకు నెలవారీ విధానంపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు

రైతుల ప్రయోజనాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి



**అమరావతి,మన జనప్రగతి మే 17:** ఆంధ్రప్రదేశ్‌లోని ఆక్వా, పొగాకు రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టి సారించారు. వారిని ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి వేర్వేరుగా లేఖలు రాశారు. రొయ్యల మేత ధరల పెరుగుదల, పొగాకుపై అధిక పన్నుల భారం వంటి కీలక అంశాలపై తక్షణమే జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఆక్వా రైతులకు ఊరట కల్పించండి..

రాష్ట్రంలో రొయ్యల మేత ధరలు విపరీతంగా పెరగడంపై ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో సీఎం చంద్రబాబు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు లేఖ రాశారు. 2026 జనవరి నుంచి మే మధ్య కాలంలో సోయా, ఫిష్ మీల్ వంటి ముడిసరుకుల **మిగతా 2లో...**

## శాంతి ఒప్పందం కుదరకపోతే గడ్డుకాలం తప్పదు

ఇరాన్‌పై వైమానిక దాడుల పునరుద్ధరణపై అమెరికా సమాలోచనలు

శాంతి ఒప్పందం కుదరకపోతే గడ్డుకాలం తప్పదని ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్

చర్చలకు అమెరికా సుముఖంగా ఉన్నా, వారిపై అపనమ్మకం ఉందన్న ఇరాన్

హార్మూజ్ వద్ద కొనసాగుతున్న ఉద్రిక్తతలు, అమెరికా నౌకాదళం మోహరింపు




**అమెరికా, మన జనప్రగతి మే 17:** పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల నడుమ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ఒక సోషల్ మీడియా పోస్ట్ ప్రపంచవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. 'ఇది తుఫాను ముందున్న ప్రశాంతత' అనే వ్యాఖ్యతో కూడిన ఒక ఏఐ-జనరేటెడ్ చిత్రాన్ని ఆయన పంచుకున్నారు. ఇరాన్‌పై మళ్లీ వైమానిక దాడులు ప్రారంభించే అంశంపై ట్రంప్ **మిగతా 2లో...**

## తెలుగు రాష్ట్రాల్లో నిప్పుల వర్షమే!


**మే 19 నుంచి 24 వరకు అత్యంత తీవ్రంగా వడగాలులు**

45 డిగ్రీలు దాటి రికార్డు స్థాయి ఉష్ణోగ్రతల నమోదుకు అవకాశం

ఉదయం 10:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లవద్దని సూచన

వృద్ధులు, చిన్నారులు, గర్భిణీలు, రోగులు మరింత అప్రమత్తంగా ఉండాలని సలహా

**హైదరాబాద్, మన జనప్రగతి మే 17:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎండలు దంచికొట్టనున్నాయి. రానున్న వారం రోజుల పాటు ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా మే 19 నుంచి 24వ తేదీ వరకు ఆరు రోజుల పాటు భానుడి ప్రతాపం చుక్కలు చూపించనుందని, బలమైన వడగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. **మిగతా 2లో...**




## విజయ్ నాకు సమవుజ్జీ కాదు

రజినీకాంత్ సంచలన వ్యాఖ్యలు

కమల్ సీఎం అయితే అసూయపడతా

స్టాలిన్ నాకు మంచి మిత్రుడు

పార్టీ పెడితే కచ్చితంగా గెలిచేవాణ్ని

రాజకీయాలతో సంబంధం లేదు



2లో.

## రెండ్రోజుల్లో రెండు సార్లు సీఎన్జీ ధర పెంపు

వాహనదారులపై ఇంధన భారం - ఇటీవల రూ.2 పెంపు..మళ్లీ ఇప్పుడు రూపాయి పెంపు




2లో.

## ఎబోలా వైరస్ కలకలం

హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించిన డబ్ల్యూహెచ్ఓ

కాంగోలో 88 మంది మృతి

మరణాల శాతం ఎక్కువ : వైద్య అధికారులు



## బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయాలి

కేటీఆర్ విమర్శలు

నిందితుణ్ని 9 రోజులు కేంద్ర మంత్రే దాచారని ఆరోపణ

బాధిత కుటుంబాన్ని బెదిరించారన్న కేటీఆర్



**హైదరాబాద్, మన జనప్రగతి మే 17:** కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌ను కేంద్ర మంత్రివర్గం నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. ఎల్బీనగర్‌లో నిర్వహించిన 'నా బూత్- నా భవిష్యత్తు' కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. **మిగతా 2లో...**

## నాలుగు కేటగిరీలుగా తెలంగాణ ఉద్యమకారులు



తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపునకు నాలుగు కేటగిరీలు

కేశవరావు నేతృత్వంలో సమావేశమైన ఉన్నతస్థాయి కమిటీ

ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన వారికి తొలి ప్రాధాన్యం

రాజకీయాలకు అతీతంగా, పక్షపాతం లేకుండా గుర్తింపు ప్రక్రియ

జిల్లాల పర్యటనలు, అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని నిర్ణయం

**హైదరాబాద్, మన జనప్రగతి మే 17:** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీ కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు నేతృత్వంలోని ఈ కమిటీ ఆదివారం తొలిసారి **మిగతా 2లో...**



## ఏపీలో జూన్ 12 నుంచి కొత్త పింఛన్లు

ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు

కీలక నిర్ణయం తీసుకున్న చంద్రబాబు సర్కారు

వితంతువులకు కొత్తగా పెన్షన్లు

త్వరలోనే ఆన్ లైన్ లో పేర్లు నమోదుకు అవకాశం

**అమరావతి,మన జనప్రగతి మే 17:** రాష్ట్రంలోని వితంతువులకు ఏపీలోని కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా జూన్ 12వ తేదీ నుంచి కొత్తగా పింఛన్లు మంజూరు చేయనున్నట్లు రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రకటించారు. **మిగతా 2లో...**

# ఎబోలా వైరస్ కలకలం

**హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించిన డబ్ల్యూహెచ్ఓ**

**కాంగోలో 88 మంది మృతి**

**మరణాల శాతం ఎక్కువ : వైద్య అధికారులు**

**కాంగో:మన జనప్రగతి మే 17:** ప్రాణాంతక ఎబోలా వైరస్ ఆఫ్రికా దేశం కాంగోలో మరోసారి కలకలం రేపుతున్న నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఆరోగ్య సంక్షోభాన్ని అంతర్జాతీయ ఆరోగ్య అత్యవసర పరిస్థితిగా ఆదివారం ప్రకటించింది. ఈ రకం వైరస్‌కు టీకా అందుబాటులో లేదని అధికారులు హెచ్చరించిన నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ నిర్ణయం తీసుకుంది. కాగా, అత్యంత వేగంగా వ్యాపించే ఎబోలా వైరస్ కారణంగా కాంగోలో 88 మంది మరణించారు. మరో 336 మందికి ఎబోలా వైరస్ సోకిందని ఆఫ్రికాలోనే అతిపెద్ద ప్రజారోగ్య కేంద్రం సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సీడీసీ) శనివారం తెలిపింది. ఈ మేరకు ప్రపంచ ఆరోగ్య సంస్థ అప్రమత్తమైంది. బండిబుగ్యో ఎబోలా వైరస్ రకం వల్ల సంభవించిన ఈ వ్యాప్తి అంతర్జాతీయంగా ఆందోళన కలిగించే విషయమని డబ్ల్యూహెచ్ఓ అభిప్రాయపడింది. ఎబోలా కేసుల సంఖ్య, వ్యాప్తి వాస్తవ పరిస్థితిపై స్పష్టత లేదని తెలిపింది. ఈ క్రమంలో అంతర్జాతీయ ఆరోగ్య అత్యవసర పరిస్థితిని ప్రకటిస్తూ నిర్ణయం తీసుకుంది. కాగా, ఇది అంతర్జాతీయ ఆరోగ్య నిబంధనల ప్రకారం రెండో అత్యున్నత హెచ్చరిక స్థాయి.

**కాంగోలో ఆందోళనకరంగా వైరస్ వ్యాప్తి : డబ్ల్యూహెచ్ఓ**

ఎబోలా సంక్రమించిన వ్యక్తుల వాస్తవ సంఖ్య, భౌగోళిక వ్యాప్తికి సంబంధించి క్లారిటీ రావాల్సి ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. ఈ ఎబోలా వైరస్ వల్ల ప్రపంచ దేశాలకు తక్షణ ముప్పు లేకపోయినా, కాంగో పొరుగు దేశాలకు వేగంగా వ్యాప్తి చెందే అవకాశం ఉందని హెచ్చరించింది. ఇప్పటికే కాంగోలో ఎబోలా వైరస్ వ్యాప్తి ఆందోళన కలిగిస్తోందని పేర్కొంది.

**కాంగో హెల్త్ మినిస్టర్ ఏమన్నారంటే?**

తమ దేశంలో ఎబోలా వైరస్ వ్యాప్తిపై కాంగో ఆరోగ్య మంత్రి శామ్యూల్ రోజర్ కంబా స్పందించారు. బుండిబుగ్యో రకం ఎబోలా వైరస్‌కు వ్యాక్సిన్ లేదన్నారు. ఈ వైరస్ వ్యాప్తికి నిర్దిష్ట చికిత్స లేదని చెప్పారు. ఈ వైరస్ సోకిన మొదటి రోగి ఒక నర్సు అని తెలిపారు. ఆమె ఈ ఏడాది ఏప్రిల్ 24న ఇటూరి ప్రావిన్స్ రాజధాని బునియాలోని ఒక ఆరోగ్య కేంద్రానికి ఎబోలా లక్షణాలతో వచ్చారని వెల్లడించారు. ఈ వ్యాధి సోకితే జ్వరం, రక్తస్రావం, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తాయని ఖ.

ఈ వ్యాధి వేగంగా వ్యాప్తి చెందడాన్ని అత్యంత ఆందోళనకరంగా వైద్య సహాయక బృందం డాక్టర్స్ వితౌట్ బోర్డర్స్ (ఎంఎస్ఎఫ్) పేర్కొంది. ఇంత తక్కువ సమయంలో ఇన్ని ఎబోలా కేసులు నమోదవ్వడం, మరణాలు అత్యంత ఆందోళన కలిగించే విషయమని అభిప్రాయపడింది. ఈ సంస్థ ప్రస్తుతం ఎబోలా వైరస్ వ్యాప్తి చెందిన ఇటూరి ప్రాంతానికి వైద్య, సహాయక సిబ్బందిని తరలిస్తోంది.

**మరణాల శాతం ఎక్కువ : వైద్య అధికారులు**

మరోవైపు, వైద్య అధికారులు సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ రకం ఎబోలా వైరస్ సోకితే మరణాల రేటు చాలా ఎక్కువగా ఉంటుందని హెచ్చరించారు. వ్యాధి సోకిన వారిలో మరణాల రేటు 50 శాతం వరకు చేరవచ్చని అంచనా వేశారు. 2007లో తొలిసారిగా ఈ స్ట్రెయిన్‌ను గుర్తించారని చెప్పారు. కాంగోకు పొరుగున ఉన్న ఉగాండాలోని ఓ వ్యక్తిని ఈ వైరస్ తొలిసారి బలిగొందని వెల్లడించారు. 1976లో గుర్తించిన జైర్ రకం ఎబోలా వైరస్‌కు మాత్రమే వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. కాంగోలో ఎబోలా వైరస్ వ్యాప్తి చాలా ఎక్కువగా ఉందని హెచ్చరించారు.

**50 ఏండ్లల్లో 15వేల మంది మృతి**

ఎబోలా వైరస్ వల్ల ఆఫ్రికాలో గత 50 ఏండ్లల్లో సుమారు 15,000 మంది చనిపోయారు. ఈ వైరస్ సోకి గతేడాది ఆగస్టులో మధ్య ఆఫ్రికాలో 34 మంది మరణించారు. 2018- 2020 మధ్య కాంగోలో ఎబోలా వైరస్ వ్యాప్తి చెంది దాదాపు 2,300 మంది చనిపోయారు. కాగా, గబ్బిలాల నుంచి మనషులకు ఈ ఎబోలా వ్యాధి వ్యాపిస్తుంది. తీవ్రమైన రక్తస్రావం, అవయవ వైఫల్యానికి కారణమవుతుంది. ఈ వైరస్ సోకిన వ్యక్తి శారీరక ద్రవాలు, రక్తాన్ని తాకినప్పుడు ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుంది. ఈ ప్రాణాంతకమైన ఎబోలా వైరస్ 21 రోజులపాటు రోగిలో సజీవంగా ఉంటుంది.

# విజయ్ నాకు సమవుజ్జీ కాదు

**రజినీకాంత్ సంచలన వ్యాఖ్యలు**

**తమిళనాడు,మన జనప్రగతి మే 17:** తమిళనాడు ప్రజలు మార్పు కోరుకున్నారని.. అందుకే విజయ్ గెలిచారని స్టార్ హీరో రజినీకాంత్ అన్నారు. తనకు రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేదన్నారు. తానే గనక పార్టీ పెడితే కచ్చితంగా గెలిచేవాడినన్నారు. డీఎంకే అధినేత స్టాలిన్ తనకు మంచి స్నేహితుడని తెలిపారు. అందుకే ఆయన్ని కలిసినట్లు వెల్లడించారు. ఎన్నికల ఫలితాల అనంతరం స్టాలిన్‌ను కలిసిన నేపథ్యంలో రజినీపై విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. దీంతో ఆదివారం చెన్నైలోని తన నివాసంలో మీడియా



సమావేశం ఏర్పాటు చేసి వివరణ ఇచ్చారు. మరోవైపు విజయ్ సీఎంగా గెలవకూడదని తాను ఎలాంటి ప్రయత్నం చేయలేదని రజినీకాంత్ చెప్పారు. విజయ్‌ను తనకు సమవుజ్జీగా భావించడం లేదన్నారు. తమ వయసులో 28 ఏళ్ల వ్యత్యాసం ఉందన్నారు. కమల్ హాసన్ సీఎం అయితే అసూయ పడతాను గానీ, విజయ్ విషయంలో అలాంటిదేమీ లేదన్నారు. రెండు ప్రధాన పార్టీలను ఢీకొని గెలిచిన విజయ్‌కు తాను శుభాకాంక్షలు తెలిపానని గుర్తుచేశారు.

ఇటీవల ఎయిర్‌పోర్టులో ఓ వ్యక్తి విజయ్ గురించి ప్రస్తావించగా రజినీకాంత్ నవ్వుతూ వెళ్లిపోయిన విషయం తెలిసిందే. దీనిపై విమర్శలు రావడాన్నీ రజినీ తాజాగా ప్రస్తావించారు. ఎవరో వ్యక్తి ఫోన్‌లో రికార్డు చేస్తూ అడిగిన ప్రశ్నకు తాను స్పందించలేదన్నారు. తాను అనవసరంగా ఇతర విషయాల గురించి మాట్లాడే వ్యక్తిని కాదన్నారు.

# శాంతి ఒప్పందం కుదరకపోతే గడ్డుకాలం తప్పదు

మొదటిపేజీ తరువాయి

తన ఉన్నతాధికారులతో చర్చిస్తున్నారనే వార్తల నేపథ్యంలో ఈ పోస్ట్ ప్రాధాన్యం సంతరించుకుంది. ట్రంప్ తన సోషల్ మీడియాలో షేర్ చేసిన చిత్రంలో ఆయన తన ట్రేడ్‌మార్క్ 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' టోపీతో ఒక అమెరికన్ నేవీ అడ్మిరల్‌తో కలిసి యుద్ధ నౌకపై నిలబడి ఉన్నారు. అల్లకల్లోలంగా ఉన్న సముద్రం, మెరుపులతో కూడిన వాతావరణం, వెనుక వైపున ఇరాన్ యుద్ధ నౌకలు కనిపించడం వంటివి టెహ్రాన్‌కు ప్రత్యక్ష హెచ్చరికలు పంపుతున్నట్టుగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పోస్ట్ ద్వారా ట్రంప్ ఇరాన్‌కు స్పష్టమైన సంకేతాలు ఇచ్చారని అంతర్జాతీయ మీడియా వ్యాఖ్యానిస్తోంది.ఇదే సమయంలో, ఇరాన్ విషయంలో ట్రంప్ యంత్రాంగం ఒక కీలక నిర్ణయం తీసుకునేందుకు సిద్ధమవుతోందని 'న్యూయార్క్ టైమ్స్' కథనం వెల్లడించింది.



దౌత్యపరమైన ప్రయత్నాలు విఫలమైతే, ఇరాన్‌పై మళ్లీ సైనిక చర్యలు చేపట్టేందుకు అవసరమైన ప్రణాళికలపై ట్రంప్ సహాయకులు చర్చిస్తున్నారని ఆ కథనం పేర్కొంది. ఇటీవలే ఒక ఫ్రెంచ్ బ్రాడ్‌కాస్టర్‌తో ఫోన్ ఇంటర్వ్యూలో మాట్లాడిన ట్రంప్ "త్వరలో శాంతి ఒప్పందం జరగకపోతే ఇరాన్‌కు చాలా గడ్డుకాలం తప్పదు. ఒప్పందం చేసుకోవడం వారి ప్రయోజనాలకే మంచిది" అని వ్యాఖ్యానించారు.మరోవైపు, కొత్తగా చర్చలు జరపడానికి ట్రంప్ సుముఖంగా ఉన్నట్టు తమకు సంకేతాలు అందాయని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ తెలిపారు. అయితే, వాషింగ్టన్ ఉద్దేశాలపై తమకు తీవ్ర 'అపనమ్మకం' ఉందని ఆయన స్పష్టం చేశారు. ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బఘేర్ ఘలీబాఫ్ కూడా తమ 14-సూత్రాల శాంతి ప్రణాళికకు ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు ఏవీ ఫలించవని హెచ్చరించారు.గత నెలలో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ, కీలకమైన హర్మూజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రపంచంలోని దాదాపు 20 శాతం చమురు వాణిజ్యం ఈ మార్గం గుండానే సాగుతుంది. ఈ ప్రాంతంలో అమెరికా తన నౌకాదళాన్ని బలంగా మోహరించింది. ఈ పరిణామాలన్నీ మధ్యప్రాచ్యంలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయనే ఆందోళనలను రేకెత్తిస్తున్నాయి.

# రెండ్రోజుల్లో రెండు సార్లు సీఎన్జీ ధర పెంపు

**వాహనదారులపై ఇంధన భారం -ఇటీవల రూ.2 పెంపు..మళ్లీ ఇప్పుడు రూపాయి పెంపు**

**న్యూఢిల్లీ ,మన జనప్రగతి మే 17:** వాహనదారులపై ఇంధన భారం మరింత పెరిగింది. దేశవ్యాప్తంగా ఇంధన ధరల పెరుగుదలతో ఇప్పటికే సతమతమవుతున్న సామాన్యుడికి సీఎన్‌జీ కంపెనీలు మరో గట్టి షాక్ ఇచ్చాయి. ఇప్పటికే ఎన్నో ఇబ్బందులు పడుతున్న సామాన్యులకు కేంద్ర ప్రభుత్వం దేశీయంగా సీఎన్‌జీ ధరలను మరోసారి పెంచుతూ నిర్ణయం తీసుకోవడంతో పెను భారం పడినట్లైంది. తాజాగా కేజీ సీఎన్‌జీపై మరో రూపాయి చొప్పున ధరను పెంచారు. ఈ పెంపుతో అటు సొంత వాహనదారులు, ఇటు ఆటో, క్యాబ్ డ్రైవర్ల బడ్జెట్ తలకిందులైంది. గడిచిన 48 గంటల్లోనే సిఎన్‌జి ధరలు పెరగడం ఇది రెండోసారి. అంతకు ముందు మే 15న చమురు కంపెనీలు సీఎన్‌జీ ధర కిలో రూ.2 మేర పెంచాయి. కేవలం మూడు రోజుల వ్యవధిలోనే సీఎన్‌జీ వాహనదారులపై మొత్తంగా మూడు రూపాయల అదనపు భారం పడినట్లయింది. తాజా పెంపుతో రాజధాని ఢిల్లీలో సీఎన్‌జీ ధర కేజీ రూ.80.09కి చేరింది. ముంబయిలోని 84.09కి చేరింది. అలాగే, ఉత్తరప్రదేశ్‌లోని నోయిడా-గజియాబాద్ ప్రాంతంలో ఈ రేటు రూ.88.70గా నమోదు కాగా.. హైదరాబాద్‌లో అత్యధికంగా రూ.100కు చేరింది. పశ్చిమాసియా యుద్ధం, హార్మూజ్ జలసంధిలో




విధించిన ఆంక్షల నేపథ్యంలో గ్యాస్, చమురు ట్యాంకర్ల రవాణా నిలిచిపోయింది. ఈ పరిణామాల కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు భారీగా పెరగడంతో, దేశీయంగానూ ఇంధన ధరలను పెంచడం అనివార్యమైంది. నిరంతరం పెరుగుతున్న ఈ ధరలు సామాన్య, మధ్యతరగతి వాహనదారుల జేబుకు చిల్లు పెడుతున్నాయి. ఇప్పటికే పెట్రోల్ ,డీజిల్ లీటర్ పై మూడు రూపాయలు కేంద్రం అదనంగా పెంచేసింది.

## ఆక్వా, పొగాకు రైతులను ఆదుకోండి..

మొదటిపేజీ తరువాయి

ధరలు 20 శాతానికి పైగా పెరిగాయని, దీంతో మేత తయారీ ఖర్చు కిలోకు రూ.31కి పైగా పెరిగిందని లేఖలో ప్రస్తావించారు. ముడిసరుకుల ధరలు తగ్గినప్పుడు రైతులకు ప్రయోజనం బదిలీ చేయని కంపెనీలు, ఇప్పుడు భారాన్ని మోపడం సరికాదని రైతులు వాదిస్తున్నారని తెలిపారు.

ఈ నేపథ్యంలో ఫిష్ మీల్ ఎగుమతులకు ప్రోత్సాహకాలు ఇవ్వాలని, సోయా దిగుమతులపై ఆంక్షలు సడలించాలని కేంద్రాన్ని కోరారు. మరోవైపు, పౌల్ట్రీ తరహాలో ముడిసరుకుల ధరల ఆధారంగా మేత ధరలను ప్రతి నెలా సమీక్షించే విధానాన్ని తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది.

**పొగాకు రైతులను ఆదుకోండి..**

ఇదే సమయంలో, ఎఫ్‌సీవీ పొగాకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపైనా సీఎం దృష్టి సారించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు వేర్వేరు లేఖలు రాశారు. సిగరెట్లపై జీఎస్టీ, ఎక్సైజ్ డ్యూటీని భారీగా పెంచడం వల్ల కొనుగోళ్లు మందగించాయని, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు.

గతేడాది వేలంలో కిలోకు రూ.280 ఉన్న ప్రారంభ ధర, ఈ ఏడాది రూ.250కి పడిపోయిందని తెలిపారు. ఈ పన్నుల విధానం వల్ల 43 వేల మంది రైతులు, లక్షలాది మంది కార్మికుల జీవనోపాధి ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు పెంచిన పన్నులను పునఃసమీక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని చంద్రబాబు కోరారు.

## తెలుగు రాష్ట్రాల్లో నిప్పుల వర్షమే!

మొదటిపేజీ తరువాయి

ఈ రోజుల్లో పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల మార్కును దాటి రికార్డు స్థాయిలో నమోదయ్యే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

వాతావరణ శాఖ నివేదికల ప్రకారం, ఈ ఆరు రోజుల్లో వడగాల్పుల ప్రభావం అత్యంత తీవ్రంగా ఉండనుంది. దీనివల్ల వడదెబ్బ తగిలి ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉన్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రధానంగా ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 4:00 గంటల మధ్య అత్యవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావద్దని స్పష్టం చేశారు.బయటకు వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా తాగునీటి బాటిల్‌ను వెంట ఉంచుకోవాలని, వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలని సూచించారు. శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఉండేందుకు కొబ్బరి బొండాలు, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణం వంటివి ఎక్కువగా తీసుకోవాలని వైద్యులు సలహా ఇస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీ స్త్రీలు, రోగులు ఈ కాలంలో ఎండకు దూరంగా, సురక్షితమైన ప్రదేశాల్లోనే ఉండటం శ్రేయస్కరం.

## ఏపీలో జూన్ 12 నుంచి కొత్త పింఛన్లు

మొదటిపేజీ తరువాయి

శ్రీకాకుళం జిల్లా నిమ్మాడలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన ఈ కీలక ప్రకటన చేశారు.

ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, అర్హులైన లబ్ధిదారులు త్వరలోనే ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన అనంతరం ఆయన అధికారులతో మాట్లాడారు. గత ప్రభుత్వ వైఫల్యాల వల్ల అనేక రెవెన్యూ సమస్యలు పేరుకుపోయాయని, వాటిని పరిష్కరించేందుకు అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

## బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయాలి

మొదటిపేజీ తరువాయి

బండి సంజయ్ కుమారుడు భగీరథ్ పోక్సో కేసులో అరెస్టైన నేపథ్యంలో ఆయన ఈ విమర్శలు చేశారు.రాష్ట్రంలో ఒక బాలికకు తీవ్ర అన్యాయం జరిగితే ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకుండా మిన్నకుండిపోయిందని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కలిసి బాధితురాలికి అన్యాయం చేయాలని చూశాయని విమర్శించారు. కానీ ఆ బాలికకు న్యాయం జరిగేలా బీఆర్ఎస్ పార్టీ మాత్రమే పోరాడిందని తెలిపారు. గత రెండున్నరేళ్లుగా తెలంగాణలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారాయని ఆరోపించారు. ప్రధాని మోదీ చెబుతున్న 'బేటీ పడావో.. బేటీ బచావో' నినాదం కేవలం మాటలకే పరిమితమైందని విమర్శించారు.దేశ చరిత్రలో బహుశా మొదటిసారి ఓ కేంద్రమంత్రి కుమారుడిపై లుకౌట్ సర్క్యులర్ ఇచ్చే పరిస్థితి వచ్చిందని కేటీఆర్ అన్నారు. బండి సంజయ్‌ను మంత్రి పదవి నుంచి తొలగించకపోతే ఈ కేసులో విచారణ సరిగా జరగదని అనుమానం వ్యక్తం చేశారు. తప్పు చేసిన వ్యక్తిని దాదాపు 9 రోజుల పాటు దాచిపెట్టింది కేంద్రమంత్రేనని ఆరోపించారు. బాధితురాలి తల్లిదండ్రులను భయభ్రాంతులకు గురి చేసి కేసును నీరుగార్చాలని చూశారన్నారు. ఇలాంటి వ్యక్తులు ఉన్నతమైన పదవుల్లో కొనసాగడం తెలంగాణ రాష్ట్రానికే గాక దేశానికే అవమానమని మండిపడ్డారు.

## నాలుగు కేటగిరీలుగా తెలంగాణ ఉద్యమకారులు

మొదటిపేజీ తరువాయి

సమావేశమై, అసలైన ఉద్యమకారులను నాలుగు కేటగిరీల కింద గుర్తించాలని తీర్మానించింది. ఈ ప్రక్రియను రాజకీయాలకు అతీతంగా, అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తామని కమిటీ స్పష్టం చేసింది.సమావేశం అనంతరం కమిటీ తీసుకున్న నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు. దీని ప్రకారం, తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఉద్యమ సమయంలో గాయపడిన వారిని రెండో కేటగిరీలో, అరెస్టులు, జైలు జీవితం, కేసులు ఎదుర్కొన్న వారిని మూడో కేటగిరీలో చేర్చనున్నారు. ఇక క్షేత్రస్థాయిలో ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న వారిని నాలుగో కేటగిరీ కింద గుర్తించనున్నారు. వీరిని గుర్తించేందుకు అప్పటి వార్తాపత్రికల క్లిప్పింగులను ఆధారంగా తీసుకోనున్నారు.గత ప్రభుత్వం కొద్దిమందికి మాత్రమే లబ్ధి చేకూర్చిందని, తమ ప్రక్రియ అలా ఉండదని కమిటీ తేల్చిచెప్పింది. ఉద్యమకారుల గుర్తింపునకు కఠినమైన ప్రమాణాలను రూపొందిస్తామని, సంక్షేమ పథకాలు, ప్రభుత్వ గౌరవం అందించేందుకు సమగ్ర డేటాబేస్ సిద్ధం చేస్తామని పేర్కొంది. 1969, 1972, 1996 నాటి ఉద్యమకారులతో పాటు వివిధ ఉద్యోగ, కుల, న్యాయవాద, కళాకారుల జేఏసీల నుంచి కూడా సూచనలు స్వీకరించాలని కమిటీ నిర్ణయించింది.అమరవీరుల జ్యోతి ప్రాంగణంలో కమిటీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని, త్వరలో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని, అలాగే అభిప్రాయ సేకరణ కోసం జిల్లాల పర్యటనలు చేపట్టాలని సమావేశంలో తీర్మానించారు. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీలు ప్రొఫెసర్ కోదండరాం, అద్దంకి దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

## యాదాద్రి థర్మల్ ప్లాంట్‌లో అగ్నిప్రమాదం...

**యూనిట్-3లో ఎగసిపడిన మంటలు**

**నల్గొండ,మన జనప్రగతి మే 17:**

నల్గొండ జిల్లా దామరచర్లలో నిర్మాణ దశలో ఉన్న యాదాద్రి అల్ట్రా మెగా థర్మల్ పవర్ స్టేషన్‌లో ఆదివారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ప్లాంట్‌లోని యూనిట్-3లో ఒక్కసారిగా మంటలు ఎగసిపడటంతో అక్కడ పనిచేస్తున్న కార్మికులు, ఇంజినీర్లు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

యూనిట్-3 పరిధిలోని టర్బైన్ డ్రైవెన్ బాయిలర్ ఫీడ్ పంప్ ఏరియాలో ఈ ఘటన చోటుచేసుకుంది. పంప్ వద్ద లూబ్రికేషన్ ఆయిల్ లీక్ కావడమే ప్రమాదానికి ప్రాథమిక కారణంగా అధికారులు అంచనా వేస్తున్నారు. చమురు లీకేజీ కారణంగా మంటలు వేగంగా వ్యాపించి, ప్లాంట్ ప్రాంగణమంతా దట్టమైన నల్లటి పొగ కమ్ముకుంది. ఈ ప్రమాదంలో పంప్ ఏరియాలోని కంట్రోల్ కేబుళ్లు, కొన్ని కీలకమైన వాల్వ్‌లు పూర్తిగా దగ్ధమయ్యాయి.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి..
తెలుగు దినపత్రిక
18 - 05 - 2026

# ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి



**తిరుపతి మన జనప్రగతి మే 17:-**ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ శారదా దేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో మే 18వ తేది సోమవారం ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఫోన్ ద్వారా పిర్యాదులు చేసేవారు 0877-2227208 కి కాల్ చేసి మాట్లాడవచ్చని, ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తిరుపతి ప్రజలకు ఇంచార్జి కమిషనర్ శారదా దేవి తెలియజేశారు. గమనిక అర్జీదారులు వినతిపత్రంతో పాటు ఆధార్ కార్డు జతపరిచి, పనిచేయు ఫోన్ నంబర్లను పొందుపరచాలని కమిషనర్ తెలిపారు.

# యోగాతో ఆరోగ్యం సేవతో పరిశుభ్రత

### - సన్ రైజ్ సేవలు అభినందనీయం



**పులివెందుల అర్బన్ మన జానప్రగతి మే 17:** పులివెందుల పట్టణ పరిధిలోని జూనియర్ కాలేజీ క్రీడా మైదానంలో సన్ రైజ్ గ్రూప్ సభ్యులు కలసి యోగ తో ఆరోగ్యం సేవతో పరిశుభ్రత అనే కార్యక్రమాన్ని చేపట్టారు.ఆదివారం క్రీడ మైదానంలో యువతకు,ప్రజలకు ఆదర్శంగా నిలుస్తూ(తుగుట్ల మధు)సారథ్యంలో సన్‌రైజ్ యోగా గ్రూప్ ఒక గొప్ప అడుగు వేసింది.మైదానాన్ని క్లీన్ చేసి,20 బస్తాల ప్లాస్టిక్‌ను మున్సిపల్ వాహనానికి అప్పగించడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ దూరం చేయకపోతే రేపు ఆరోగ్యకరమైన జీవితం దూరమవుతుందని, యోగాతో శారీరక,మానసిక ఆరోగ్యం పెంపొందుతుంది. అదేవిధంగా వ్యక్తిగత,సామాజిక పరిశు భ్రత ద్వారా వ్యాధులు దూరమై, సమాజానికి చేసే సేవతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం ద్వారా పర్యావరణాన్ని,మన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా సహజమైన వస్తువులను వాడటం అలవాటు చేసుకోవాలని సూచిస్తూ,ఈ మహత్తర కార్యక్రమాన్ని చేపట్టిన తగుట్ల మధుసూదన్ రెడ్డికి యోగ గ్రూప్ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో యోగ గ్రూప్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అమ్మవారి సేవలో మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జన ప్రగతి మే 17:-**ప్రొద్దుటూరులోని ప్రసిద్ధ ఆలయం వాసవి కన్యకాపరమేశ్వరి దేవి అమ్మవారిని మాజీ మంత్రివర్యులు వెల్లంపల్లి శ్రీనివాస్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆర్యవైశ్యులు ఆలయ విశిష్టతను వెల్లంపల్లి కి వివరించారు. ఆలయ కమిటీ కార్యవర్గ సభ్యులు వెల్లంపల్లి శ్రీనివాస్ని, రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ని, పులివెందుల ఆర్యవైశ్య నాయకులు కరుణాకర్ ని సాధరంగా ఆహ్వానించి సత్కరించారు. దర్శనం అనంతరం ఆలయం వెలుపల ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వెల్లంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, విజయవాడ తరహా అభివృద్ధిని ప్రొద్దుటూరులో రాచమల్లు శివప్రసాద్ రెడ్డి తీసుకురావడం ఆనందంగా ఉందన్నారు. వై. ఎస్. జగన్ మోహన్ రెడ్డి హయాంలో ప్రొద్దుటూరు నుంచి ఆర్యవైశ్య సోదరులైన చిప్పగిరి ప్రసాద్, మారుతి ప్రసాద్ లను తిరుమల దేవస్థానం డైరెక్టర్లుగా నియమించడంలో రాచమల్లు పాత్ర విశేషమని పేర్కొన్నారు.అదే సందర్భంగా రాచమల్లు శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ...చంద్రబాబు సంపద సృష్టిస్తానని చెప్పి ఇప్పుడు ప్రజలను ముగ్గురు, నలుగురు పిల్లలను కనాలని చెప్పడం ద్వారా తప్పుదోవ పట్టిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# అందరివాడు అతికారి క్రిష్ణ,ఆయనతోనే పార్టీ బలోపేతం: యువ నాయకుడు దేరంగుల శ్రీకాంత్



**సిద్ధవటం మన జనప్రగతి మే 17:-** రాజంపేట నియోజకవర్గంలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేయడానికి మరియు కూటమి పార్టీల నాయకులను, కార్యకర్తలను సమన్వయ పరచడానికి అందరినీ కలుపుకుని పోయే మనస్తత్వం ఉన్న దమ్మున్న నాయకుడు అతికారి కృష్ణ మాత్రమేనని సిద్ధవటం మండలం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ శ్రీలేఖ భర్త, జనసేన పార్టీ యువ నాయకుడు దేరంగుల శ్రీకాంత్ స్పష్టం చేశారు. ఆదివారం మండల పరిధిలోని మాధవరం-1 గ్రామంలో జనసేన నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేరంగుల శ్రీకాంత్ మాట్లాడుతూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను అత్యంత దీటుగా ఎదుర్కొనగలిగే ధైర్యం, శక్తి ఒక్క అతికారి కృష్ణకే ఉన్నాయని కొనియాడారు. పొత్తు ధర్మాన్ని తప్పకుండా పాటిస్తూ, నియోజకవర్గంలో కూటమిలోని అన్ని వర్గాలను ఏకం చేయగల సమర్థుడు ఆయనేనని పేర్కొన్నారు. జనసేన పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తున్న అతికారి కృష్ణ లాంటి బలమైన నాయకుడికి పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ గారు తగిన పార్టీ పదవులను కట్టబెట్టాలని ఆయన కోరారు.అలాంటి దమ్మున్న వ్యక్తికి పదవులు ఇస్తే మరింత ఉత్సాహంతో ముందుకు వెళ్తారని, నియోజకవర్గంలోని యువతను, సీనియర్లను సమన్వయం చేసుకుంటూ రాజంపేటను అభివృద్ధి పథంలో నడిపిస్తారనే దృఢమైన నమ్మకం ఇటు కార్యకర్తల్లోనూ, అటు ప్రజల్లోనూ బలంగా ఉందని శ్రీకాంత్ ధీమా వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో పార్టీని అట్టడుగు స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దేరంగుల శ్రీకాంత్‌తో పాటు పలువురు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దేశములోని గోర్ బంజారాలను ఏకం చేయడానికి ఏక్తా సంకల్ప యాత్ర



**ఉరవకొండ మన జనప్రగతి మే 17:-** దేశములోని 20 కోట్ల బంజారాలను ఏకం చేయడానికి భారత్ బంజారా ఏక్తా సంకల్పయాత్ర చేపట్టి హక్కుల సాధనకు కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళు తున్నామని 12 రాష్ట్రాలను తిరిగి ఆయా రాష్ట్రాల గవర్నర్ ముఖ్యమంత్రిలను వినతి పత్రం సమర్పించి చివరికి దేశ రాజధాని ఢిల్లీని చేరుకొని భారత ప్రధాని నరేంద్ర మోడీకి బంజారాల హక్కుల సాధన రాజకీయ సామాజిక ఆర్థిక హక్కుల కొరకు వినతి పత్రం ఇవ్వడం జరుగుతుందని మాజీ మంత్రి డి రవీందర్ నాయక్ పేర్కొన్నారు ఆదివారం బంజారాల ఆరాధ్య దైవం సద్గురు సేవాలాల్ మహారాజ్ జన్మస్థలం సేవాగడ్ నందు ఏర్పాటు అయినా భారత బంజారా ఏక్తా సంకల్పయాత్ర కార్యక్రమానికి గౌరవ అతిథిగా విచ్చేశారు ఈ కార్యక్రమానికి ట్రస్టు అధ్యక్షులు రిటైర్డ్ ఐ జి కే జగన్నాథరావు అధ్యక్షత వహించారు ముఖ్యఅతిథిగా కర్ణాటక ఆధ్యాత్మికవేత్త శ్రీ శ్రీ మహారాజ్ హాజరయ్యారు ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో మాజీ మంత్రి మాట్లాడుతూ స్వాతంత్ర సమపార్జునులు దేశంలోని ప్రజల ఆహార ధాన్యాలు నీటి వసతి ఏర్పాటు చేసిన లకీసా బంజారా సేవాలాల్ మహారాజ్ బంజారా భుక్యా భానా నాయక్ రాణా ప్రతాప్ సింగ్ రాథోడ్ తదితరుల స్ఫూర్తితో ముందుకు సాగాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని దేశ రాజధాని లో లక్కీస బంజారా హాథిరాం బాబా విగ్రహాలను ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు ఆంధ్ర రాష్ట్రములో ఏజెన్సీ ప్రాంతాలకు లభిస్తున్న ప్రాధాన్యత మైదాన ప్రాంత బంజారాలకు చేకూర్చడం లేదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ విషయంలో దృష్టి సారించి రాయలసీమ ప్రాంతంలో రాజకీయ ప్రాధాన్యత కచ్చితంగా కల్పించాలని శాసనమండలి సభ్యులుగా నియామకం చేయాల్సిన అవసరం ఉందని కోరారు ప్రస్తుతం చేపడుతున్న బంజారా ఏక్తా సంకల్ప యాత్ర రాజకీయాలకతీతంగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు శ్రీ శ్రీ మహారాజ్ మాట్లాడుతూ దేశంలోని బంజారా లు అనేక చోట్ల అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు గడిచిన బంజారాల స్థితిగతులు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు రామ్ రావు మహారాజ్ తన లీలామృతంలో బంజారాల చరిత్ర పొందుపరచకపోయి ఉంటే సేవాలాల్ మహారాజ్ బోధనలు బహిర్గతమయ్యేవి కాదని అసలు సమాజానికి సేవాలాల్ మహారాజ్ యొక్క గొప్పతనం దేశవ్యాప్తంగా వ్యాపించినప్పటికీ బంజారాలకు సముచిత స్థానం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు దేశంలో ఎదుర్కొంటున్న సమస్యల పట్ల ఒక కార్యాచరణ ముసాయిదా తయారుచేసి దేశ ప్రధానికి వినతి పత్రం సమర్పించి హక్కుల సాధనకు శక్తి వంచన లేకుండా పోరాడుతానని పేర్కొన్నారు ఈ సందర్భంగా సద్గురు సేవాలాల్ మహారాజ్ మాత జగదంబ లను ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రార్థనలు జరిపారు ఈ కార్యక్రమంలో వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ పిఎల్ రవీంద్ర నాయక్ సెక్రటరీ రంగా నాయక్ మహారాష్ట్ర కు చెందిన రామ్ దాస్ సింగ్ మహారాజ్ ఢిల్లీకి చెందిన ప్రవీణ్ రాథోడ్, హర్యానాకు చెందిన బిఎల్ నాయక్ కల్చరల్ అండ్ ట్రెడిషనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.కె సుబ్రహ్మణ్యం నాయక్ మాజీ ఎంపీ స్వామి నాయక్ ఫౌండేషన్ చైర్మన్ కమల్ సింగ్ రాథోడ్ డాక్టర్ శ్రీరాములు నాయక్ చతిస్గఢ్ తమిళనాడు కర్ణాటక మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల బంజారా సంఘం ప్రతినిధులు ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు

# జూన్ 21వ తేదీ నిర్వహించే భారీ బహిరంగ సభకు తరలి రావాలి

### రాష్ట్ర అధ్యక్షులు దుడెం రెడ్డి బాబు



**కడప మన జనప్రగతి మే 17:-** దేశ రాజధాని ఢిల్లీలో కొలీ సమాజ్ జాతీయ ముదిరాజ్ సంక్షేమం సంఘం ఆద్వర్యంలో జూన్ 21న నిర్వహించే భారీ బహిరంగసభకు ముదిరాజ్ కుటుంబ సభ్యులు ప్రతి ఒక్కరూ పాల్గొని తమ సత్తా ఏమిటో చాటి చెప్పాలని ఆంధ్రప్రదేశ్ ముదిరాజ్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దుడెం రెడ్డిబాబు పిలుపునిచ్చారు.కడప నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆంధ్రప్రదేశ్ ముదిరాజ్ సంక్షేమ సంఘం 2వ రాష్ట్ర సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రెడ్డిబాబు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఉన్న ముదిరాజ్ కులస్తులను ఏకం చేస్తూ మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్‌గొవింద్, ఎంపీ వీరేంద్ర కశ్యప్, వర్కింగ్ ప్రెసిడెంట్ భూపతి పిలుపుమేరకు ఢిల్లీలో భారీ బహిరంగసభ నిర్వహించనున్నామన్నారు.ఈ సభకు ఢిల్లీ సీఎం రేఖాగుప్తా అతిథిగా రానున్నారన్నారు.తమ రిజర్వేషన్లను సాధించుకునేందుకు,ముదిరాజ్‌లకు దేశ వ్యాప్తంగా ఒకే కులం, ఒకే పేరు పెట్టాలన్న ఉద్దేశ్యంతో ఈ సభ జరుగుతోందన్నారు. ఇటువంటి తరుణంలో రాష్ట్రం నుంచి కూడా ముదిరాజ్‌ల సత్తా ఏమిటో చాటిచెప్పాల్సిన అవసరం ఉందన్నారు. 201924లో వైసీపీప్రభుత్వం లక్షా 80 వేల మంది అని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 3 లక్షల మందికి ముదిరాజ్ సామాజిక వర్గీయులు ఉన్నారని తెలియజేసిందన్నారు. ఉమ్మడిరాష్ట్రంలో కోటి మంది ఉన్న జనాభాలో తెలంగాణలో 60 లక్షల మందిపోను మిగిలిన 40 లక్షల మంది మన రాష్ట్రంలో ఉండాల్సి ఉండగా గత, ప్రస్తుత పాలకులు తమను మభ్యపెట్టే చర్యలు చేపడుతున్నాయన్నారు. బీసీల్లో అత్యంత వెనుకబడిన ముదిరాజ్ కులస్తులకు రిజర్వేషన్లు, ఉద్యోగ, ఉపాధిలో తోడ్పాటు, ప్రభుత్వంలో పనిచేస్తున్న ముదిరాజ్‌లకు పదోన్నతులు కల్పించాలని, ప్రైవేటు సంస్థల్ల పనిచేస్తున్న వారికి రిజర్వేషన్లు కల్పించకుండా పాలకుల ప్రలోభాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తమను ఓటుబ్యాంకుగా మార్చుకుని మభ్యపెట్టే చర్యలను ఖండిస్తూ తమను బీసీఏలో చేర్చాలని, రిజర్వేషన్లు పెంచాలని, అవసరమైతే ఎస్సీ సామాజికవర్గంలో చేర్చి ముదిరాజ్ కులస్తులను అన్ని విధాల ఆదుకోవాలని కోరారు.

# వైసిపి విమర్శలకు టీడీపీ ఘాటు కౌంటర్

### ఆధారాలతో త్వరలోనే నిజాలు బయటపెడతాం

### టీడీపీ నాయకులు షేక్ కాశీం,దుంప వెంకటేశ్వర రెడ్డి




**పులివెందుల అర్బన్ మన జన ప్రగతి మే 17:** వైసీపీ మున్సిపాలిటీ నాయకులు నిన్న ప్రెస్ మీట్‌లో చేసిన వ్యాఖ్యలపై తెలుగుదేశం పార్టీ తీవ్రంగా స్పందించింది.టీడీపీ జిల్లా ముస్లిం మైనారిటీ అధికార ప్రతినిధి షేక్ కాశీం వల్లి,యువ నాయకులు దుంప వెంకటేశ్వర రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసిపి నాయకుల అవగాహన లేని మాటలను చూసి పులివెందుల ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు.తమ నాయకుడు అక్కులుగారి విజయ్ కుమార్ రెడ్డిపై పెట్టినవన్నీ రాజకీయ అక్రమ కేసులేనని ఆయన కేవలం రాజకీయ రౌడీ షీటర్ మాత్రమేనని స్పష్టం చేశారు. ఎదుటివారి గొంతులు కోసి, గొడ్డళ్లతో నరికే రౌడీ షీటర్లు తమ పార్టీలో లేరని దుయ్యబట్టారు.ఎవరూ పుట్టడంతోనే సంపన్నులు కారని,కష్టపడి పైకి వస్తారని పేర్కొంటూ వైఎస్ భాస్కర్ రెడ్డి,వైఎస్ మనోహర్ రెడ్డిల గత కాలపు వ్యాపారాలను మైనింగ్ బెదిరింపులను వారు ప్రస్తావించారు.ఇంత భారీ ఎత్తున భవనాలు,జిల్లా స్థాయి రాజకీయాలు ఎలా చేయగలిగారో ఆ కిటుకు చెప్తే,తమ భవనాల వివరాలు కూడా చెప్తామన్నారు.తమ నాయకుడి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న వారంతా 18 ఏళ్లు పైబడిన అభిమానులేనని,మీ నాయకుల్లా రాజకీయాల కోసం సొంత చిన్నాన్నను బాత్‌రూమ్‌లో గొడ్డలితో నరికిన చరిత్ర,చిన్న పిల్లల గొంతులు కోసిన చరిత్ర తమకు లేదని మండిపడ్డారు.తమ నాయకుడు ఆస్తులకు మున్సిపల్ టాక్స్,వాహనాలకు రోడ్ టాక్స్ నికార్సుగా కడుతున్నారని తెలిపారు.దీనికి భిన్నంగా పులివెందుల మున్సిపాలిటీ నగిరిగుట్టలో ఒక మాజీ కౌన్సిలర్ డోర్ నెంబర్ 1-5-679 గల కొట్టం స్థలంలో ఐదేళ్ల క్రితం 45 లి 45 అడుగుల ఇల్లు కట్టినా,ఇప్పటికీ మున్సిపల్,సచివాలయ సిబ్బందిని మోసం చేస్తూ కొట్టం కింద రూ.54 మాత్రమే పన్ను కడుతున్నారని ఆరోపించారు.దీనిపై మున్సిపల్ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అలాగే నగిరిగుట్టకే చెందిన సదరు మాజీ కౌన్సిలర్ పద్మనాభరెడ్డి కొడుకు బోలెరో వాహనం నడుపుతూ,దొంగ సర్టిఫికెట్‌తో గత ఐదేళ్లుగా వికలాంగుల పింఛన్ తీసుకుంటున్నారని ఇదా మీ నిజాయితీ అని ప్రజలు ప్రశ్నిస్తున్నారని పేర్కొన్నారు.మట్కా,జూదాల గురించి వైసిపి నాయకులు మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని, గతంలో మట్కా డబ్బులతో ఫ్లెక్సీలు కట్టింది,ఇళ్లల్లో జూదాలు ఆడించింది ఎవరో తమ ఇంటి దైవంపై ప్రమాణం చేసి చెప్పాలని సవాల్ విసిరారు.పులివెందులలోని మల్లెలగుట్ట,లింగాల మండలం దొండ్లవాగు మరియు మార్కెట్ యార్డ్ పక్కన అధికారులను భయభ్రాంతులకు గురిచేసి చేసిన బంజర్ భూముల కబ్జాల వివరాలన్నీ ప్రజలకు తెలుసని త్వరలోనే వీటన్నింటినీ పూర్తి ఆధారాలతో మీడియా ముందుకు తీసుకొస్తామని హెచ్చరించారు. ఈ విలేకరుల పార్లమెంట్ తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి సాతుపాటి రఘు,షామీర్ భాషా తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
18 - 05 - 2026

# నీటి ఎద్దడి నివారించి పుణ్యం కట్టుకోండి సారూ...

**- మోటార్ రిపేరు చేయని అధికారులు..!**



**సిద్దవటం మన జనప్రగతి మే 17**:-మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలో గల వెంకటేశ్వరాపురం రోడ్డు నెంబరు 9లో తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. ఎండలు మండిపోతున్న తరుణంలో, స్థానిక తాగునీటి బోరు మోటార్ పాడవడంతో ప్రజలు నీటి కోసం అల్లాడిపోతున్నారు. సుమారు 20 రోజుల క్రితం పంచాయతీ కార్యదర్శి చేపూరి లక్ష్మీ నరసయ్య సమస్యను పరిష్కరిస్తామని చెప్పి, రిపేరు నిమిత్తం బోరులోని మోటార్, పైపులను బయటకు తీయించారు. అయితే, ఇంతవరకు వాటిని బాగు చేయించి తిరిగి బిగించకపోవడంపై వెంకటేశ్వరాపురం ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే మోటార్‌ను బాగు చేయించి, తమ నీటి సమస్యను తీర్చాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

# ఘనంగా ఇరుగులమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవం


**- పెద్ద సంఖ్యలో భక్తులు,అన్నప్రసాద వితరణ**





**సిద్ధవటం మన జనప్రగతి మే 17:-** మండలంలోని మూలపల్లి క్రాస్ వద్ద వెలసిన శ్రీ ఇరుగులమ్మ తల్లి అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకాలు వంటి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ పూజారి రమణయ్య తెలిపారు. మహిళా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు. అనంతరం, మధ్యాహ్నం వేళ భక్తులందరికీ కడప నగరానికి చెందిన ఇరగయ్య కుటుంబీకులు ఘనంగా అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# పులివెందులలో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మే 17:** పులివెందుల పట్టణంలోని పలు ప్రాంతాలలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జగదీశ్వర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.ఆర్.సి.ఎమ్ చర్చ్ మరియు రోటరీ పురం పరిసర ప్రాంతాల కు ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు విద్యుత్ లైన్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను నరికే పనులు చేపట్టడం వల్ల విద్యుత్ నిలిపివేస్తు న్నారన్నారు.మూడు గంటల పాటు జరిగే ఈ ట్రీ కటింగ్ పనుల దృష్ట్యా విద్యుత్ వినియోగదారులు,ప్రజలు సిబ్బందికి సహకరించవలసిందిగా ఏఈఈ జగదీశ్వర్ రెడ్డి కోరారు.

# గంగమ్మ తల్లికి సారె సమర్పించిన టేప్ సభ్యులు..అనంతరం జనరల్ బాడీ సమావేశం






**తిరుపతి మన జనప్రగతి మే 17:-** టేప్ సభ్యులందరూ కలిసి తాతయ్యకుంట గంగమ్మ తల్లిని దర్శించుకుని, అమ్మవారికి సారె సమర్పించి మొక్కుబడి తీర్చుకున్న అనంతరం టేప్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు.ది అసోసియేషన్ ఆఫ్ ప్లానర్స్ అండ్ ఇంజనీర్స్ (టేప్) అధ్యక్షులు మట్ల ప్రసాద్ రెడ్డి గారి అధ్యక్షతన స్థానిక టేప్ నిలయంలో జనరల్ బాడీ సమావేశం జరిగింది.ఈ సమావేశానికి రాష్ట్ర వాయల్‌టీపీ చైర్మన్ కుమార మంగళం, జనరల్ సెక్రటరీ లక్ష్మణ్ హాజరయ్యారు.వారు మాట్లాడుతూ...ఎల్టీపీల సమస్యలను రాష్ట్ర స్థాయిలో అధికారులతో చర్చించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.టేప్ అధ్యక్షులు మట్ల ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఎల్టీపీ సభ్యునికి టేప్ తరపున ఉచితంగా హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించనున్నట్లు ప్రకటించారు.టేప్ చైర్మన్ టి.వెంకటేష్ బాబు మాట్లాడుతూ అక్టోబర్ నెల 24, 25 తేదీలలో స్థానిక పీఎల్ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో టేప్ ఎక్స్‌పో2026 నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర స్థాయి నాయకులు ఎక్స్‌పో చైర్మన్ శ్రీనివాస కుమార్, అడ్వైజరీ కమిటీ సభ్యులు నాగ శ్రీనివాస్, మదన్ గోపాల్, వైస్ ప్రెసిడెంట్లు ఉదయతుల్లా, జయప్రకాష్, టేప్ సెక్రటరీ బుసా షణ్ముగం, వైస్ ప్రెసిడెంట్ పి. నాగేశ్వరరావు, ట్రెజరర్ ఇ. సందీప్, జాయింట్ సెక్రటరీలు శివశంకర్ రెడ్డి, బంగారయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం. నరేష్, వెల్ఫేర్ సెక్రటరీ డి. సురేష్, అలాగే ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు వసంతరావు, శ్రీనివాసమూర్తి, కిషోర్ కుమార్, ఎంఎస్ శంకర్, జీడీఎన్ సురేష్, ఆర్.ఆర్. శ్రీనివాసులు, కె.ఆర్. శివకుమార్, విద్యాసాగర్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ జగజ్జనని రేణుక ఎల్లమాంబ అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్సీ పుత్తా నరసింహారెడ్డి



**సిద్ధవటం మన జనప్రగతి మే 17:-** మండలంలోని మాచుపల్లి గ్రామంలో వెలిసిన శ్రీ జగజ్జనని రేణుక ఎల్లమాంబ అమ్మవారిని టీడీపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ పుత్తా నరసింహారెడ్డి దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఆలయ పెద్దలు ఆయనకు సాంప్రదాయబద్ధంగా ఘనంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్ర అభివృద్ధి,అమరావతి రాజధాని పనులు వేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు.కూటమి ప్రభుత్వానికి అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి క్లీన్ స్వీప్ చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్దానిక టిడిపి నేతలు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక దందాలో వర్గ పోరు..వెలవలిలో ఉద్రిక్తత

- డబ్బుల పంపకాలపై రెండు వర్గాల మధ్య ఘర్షణ
- వాగ్వాదం దాడుల వరకు చేరడంతో గ్రామంలో భయాందోళన
- పోలీసుల జోక్యంతో పరిస్థితి అదుపులోకి....



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జన ప్రగతి మే 17:-**ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని రాజుపాలెం మండలం వెలవలి గ్రామంలో అక్రమ ఇసుక మాఫియా వ్యవహారం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. అధికార పార్టీకి చెందిన రెండు వర్గాల అనుచరులు అక్రమ ఇసుక రవాణా ద్వారా వచ్చే డబ్బుల పంపకాల విషయంలో పరస్పరం ఘర్షణకు దిగడం స్థానికంగా కలకలం రేపింది.శనివారం ఉదయం వెలవలి గ్రామ సమీపంలోని ఏటిలో అక్రమంగా ఇసుక తరలింపు జరుగుతుండగా,ఆ వ్యవహారానికి సంబంధించిన డబ్బుల విషయంలో టిడిపి నాయకుల అనుచరుల మధ్య వివాదం చెలరేగినట్లు సమాచారం. ఈ వివాదం క్రమంగా రెండు వర్గాల మధ్య ఉద్రిక్తతకు దారి తీసి,పరస్పరం దాడులు చేసుకునే స్థాయికి చేరుకుంది. గ్రూపులుగా విడిపోయిన ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు దూసుకెళ్లి తీవ్ర వాగ్వాదానికి దిగడంతో పాటు తోపులాటలు, దాడులకు పాల్పడినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. ఘటన సమయంలో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొనగా, స్థానిక ప్రజలు భయాందోళనకు గురయ్యారు.ఏటిలో అక్రమ ఇసుక తవ్వకాలు,రవాణా కొంతకాలంగా కొనసాగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇసుక దందా ద్వారా భారీగా డబ్బులు వస్తుండటంతో ఆధిపత్య పోరు పెరిగి,అదే ఇప్పుడు బహిరంగ ఘర్షణలకు దారి తీసిందని స్థానికులు చర్చించుకుంటున్నారు.సంఘటన సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చినట్లు తెలిసింది.ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# దివ్యాంగులు కాకూడదు భారం - సమాజానికి వారే బలమైన ఆధారం

**• ఆర్ అండ్ బి డివిజనల్ ఇంజనీర్ సగిలి శ్రీధర్ రెడ్డి**





**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మే 17:**అంగవైకల్యం శాపం కాదని, అది మనిషి శారీరక,మానసిక అనారోగ్యస్థితి మాత్రమేనని, దివ్యాంగులు తమ వైకల్యాన్ని గురించి బాధపడకుండా, వికలత్వాన్ని జయించి, అవకాశాలను అందిపుచ్చుకొని అద్భుతాలు సృష్టించాలని, ప్రపంచంలో ఎంతోమంది విభిన్నప్రతిభావంతులు వివిధ రంగాలలో విశిష్టంగా రాణించి, అన్నిఅవయవాలు సక్రమంగా ఉన్నవారికన్నా ఉన్నత స్థాయికి ఎదిగి,మిగిలిన వారికి స్ఫూర్తిప్రదాతలుగా నిలిచారని, అందులో మన భారత ప్యారా ఒలంపిక్ క్రీడాకారులను, ఇటీవల అంధుల ప్రపంచ కప్ గెలిచిన భారత అంధుల క్రికెట్ జట్టును ప్రత్యేకంగా పేర్కొనవచ్చునని, అదేవిధంగా,తన తండ్రి దివంగత సగిలి బసిరెడ్డి ప్రథమవర్ధంతి సందర్భంగా దివ్యాంగులకు చేయూతనందించడం సంతృప్తికరంగా ఉందని పులివెందుల రోడ్లు భవనాల శాఖ డివిజనల్ ఇంజనీర్ సగిలి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు.వీరపునాయునిపల్లె మండలం అనిమెల గ్రామానికి చెందిన దివంగత సగిలి బసిరెడ్డి ప్రథమవర్ధంతిని పురస్కరించుకుని, వారికుటుంబసభ్యుల ఆధ్వర్యంలో పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో గల వికలాంగుల కమ్యూనిటీ భవనంలో ఏర్పాటుచేసిన ఒక సంస్మరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీధర్ రెడ్డి తమ కుటుంబసభ్యులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘననివాళులర్పించారు. అనంతరం ఆయన ఆత్మశాంతికై రెండునిమిషాలు మౌనం పాటించారు.ఈసందర్భంగా సగిలి కుటుంబసభ్యులు 30మంది దివ్యాంగుల కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. దివంగత బసిరెడ్డి స్మారకార్థం వికలాంగులకు సహాయసహకారాలు అందించిన వారి కుటుంబసభ్యులకు వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షులు డా.ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి డివిజనల్ ఇంజనీర్ సగిలి శ్రీధర్ రెడ్డి, ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాల అధ్యాపకురాలు అనిత,రిటైర్డ్ టీచర్ నారపురెడ్డి,శశిధర్ రెడ్డి, శిరీష,తన్వి, యశ్వంత్ రెడ్డి, కౌశిక్ రెడ్డి,వికలాంగుల నెట్ వర్క్ అధ్యక్షులు రఘునాథ రెడ్డి,సంయుక్త కార్యదర్శి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# స్నేహిత అమృత హస్తం సేవాసమితికి రూ.25 వేల విరాళం



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మే 17:** పులివెందుల పట్టణానికి చెందిన దివంగత సగిలి బసిరెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు సేవా కార్యక్రమాలకు అండగా నిలిచారు.స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఆధ్వర్యంలో నిర్మించబడుతున్న నూతన భవన సముదాయం నిర్మాణానికి ఆయన జ్ఞాపకార్థంగా రూ.25 వేల విరాళాన్ని అందజేశారు.ఆదివారం వారి స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో రోడ్లు & భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్ రెడ్డి,ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల అధ్యాపకురాలు అనిత, శశిధర రెడ్డి,శిరీష చేతుల మీదుగా ఈ మొత్తాన్ని సేవాసమితి అధ్యక్షులు రాజుకు అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్నేహిత అమృత హస్తం సేవాసమితి విద్య,వైద్య,సామాజిక రంగాల్లో నిరంతరం ప్రజాహిత కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తోందని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఉచిత కోచింగ్, పేదలకు వైద్య సేవలు,నేత్ర సేకరణ కార్యక్రమాలు, యువతకు స్వయం ఉపాధి శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు నిర్మిస్తున్న నూతన భవన సముదాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.తమ తండ్రి సగిలి బసిరెడ్డి సేవాభావాన్ని స్మరించుకుంటూ ఈ విరాళాన్ని అందజేయడం ఆనందంగా ఉందన్నారు.సేవాసమితి అధ్యక్షులు రాజు మాట్లాడుతూ,సంస్థ సేవలను గుర్తించి సహకరిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.సమాజంలో సేవా కార్యక్రమాల విస్తరణకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమని పేర్కొన్నారు.దాతల సహకారంతో నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు మరింత సేవలు అందించే దిశగా కృషి చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో బసిరెడ్డి మనవళ్లు యశ్వంత్ రెడ్డి, కౌశిక్ రెడ్డి,మనవరాలు తన్వి, సేవాసమితి సభ్యులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# మల్లంపల్లి చెరువు తూము మరమ్మత్తు పనులు ప్రారంభం

**• రైతులకు ఊరట కల్పిస్తున్న సర్పంచ్ ల్యాద శ్యామ్ రావు**



**మల్లంపల్లి మన జనప్రగతి మే 17:** మల్లంపల్లి గ్రామ చెరువు తూము మరమ్మత్తు పనులను గ్రామ సర్పంచ్ ల్యాద శ్యామ్ రావు గారి చొరవతో ప్రారంభించడం జరిగింది. యాసంగి పంటలు సాగు చేసిన రైతులకు తూము ద్వారా నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ సమస్యను గుర్తించిన సర్పంచ్ ల్యాద శ్యామ్ రావు గారు వెంటనే నీటి పారుదల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, మరమ్మత్తు పనులు త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు చేపట్టారు.గ్రామ రైతులకు సాగునీరు అందే విధంగా చెరువు తూము పనులు చేపట్టడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు. రైతుల సమస్యల పరిష్కారంలో గ్రామ పంచాయతీ ముందుండి పనిచేయడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ల్యాద శ్యామ్ రావు గారు, ఉప సర్పంచ్ అంకం సురేష్, జిల్లా జనరల్ సెక్రటరీ దేవేంద్ర చారి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ చిట్టి రెడ్డి రామిరెడ్డి, వార్డ్ మెంబర్ కొంగరి నరేందర్, హైమద్ పాషా, గూడెపు రాజిరెడ్డి, షాపూర్ మహేందర్, కొల్లిపాక శ్రీనివాస్, షాపూర్ సుధాకర్, ఇటకాల నరహరి, అశోక్, ఇటకాల కరుణాకర్ మరియు గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ ప్రైవేటీకరణ ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనం

**● వైసిపి ఎస్ ఈ సి సభ్యుడు సత్య సాయినాథ్ శర్మ ధ్వజం**



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి మే 17:-** రాష్ట్రంలో పరిపాలన చేతగాని కూటమి ప్రభుత్వం ఆర్టీసీని ప్రైవేటుపరం చేయడానికి నిర్ణయించడం అసమర్థ పాలనకు అద్దం పడుతోందని వైసిపి రాష్ట్ర ఎస్ ఈ సి సభ్యుడు కాశీభట్ల సత్య సాయినాథ్ శర్మ ధ్వజమెత్తారు. కమలాపురంలో ఆదివారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో సంపద సృష్టించి రాష్ట్రాన్ని దేశంలో అగ్రగామిగా నిలుపుతానని ఊక దంపుడు ఉపన్యాసాలు చేసి ప్రజల ఓట్లు కొల్లగొట్టి మోసపూరితంగా మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ నాయకుల అసలు రంగు ఇప్పుడిప్పుడే బయట పడుతోందన్నారు. రాష్ట్రంలో ప్రజలకు ప్రభుత్వపరంగా ఎంతగానో ఉపయోగపడే రోడ్డు రవాణా సంస్థను ప్రైవేట్ పరం చేయడానికి కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం రాష్ట్ర ప్రజలకు తీరని ద్రోహం చేసినట్లేనన్నారు. 40 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ అనుభవం 14 సంవత్సరాల ముఖ్యమంత్రిగా పాలన నిర్వహణ వీటి దృష్ట్యా సంపద సృష్టించి రాష్ట్రాన్ని అప్పుల పాలు అవ్వకుండా చేసి దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలుపుతామని కూటమి ప్రభుత్వ నాయకులు ప్రకటించుకున్న హామీలు ఒక్కొక్కటిగా గాలిలో కలిపేస్తున్నారన్నారు. రాష్ట్రంలో రోడ్డు రవాణా సంస్థ ఏర్పడినప్పటి నుంచి అది కేవలం ఒక ప్రభుత్వ కార్పొరేషన్ గా మాత్రమే ఉండేదని, అయితే మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రోడ్డు రవాణా సంస్థను ప్రభుత్వంలో విలీనం చేసి నూతన అధ్యాయం సృష్టించి ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగులకు పూర్తి భరోసా కల్పించారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చేతగానితనంతో పరిపాలన చేయలేక చేతులెత్తేసి ఆర్టీసీని ప్రైవేటుపరం చేస్తామని ప్రకటించడం చూస్తుంటే త్వరలో ఈ రాష్ట్రాన్ని కూడా తాకట్టు పెట్టడానికి కూడా వెనుకాడరేమోనన్న ఆలోచన కలుగుతోందన్నారు. పరిపాలన చేతకానప్పుడు స్వచ్ఛందంగా రాజీనామా చేసి అసెంబ్లీని రద్దుచేసి ఎన్నికలకు వెళ్లాలని ఆయన సూచించారు. కూటమి ప్రభుత్వంలోని వారు రాష్ట్ర అభివృద్ధిని పక్కకు పెట్టి సంపాదనే ధ్యేయంగా పనిచేస్తూ రాష్ట్రాన్ని అధోగతిపాలు చేస్తుండటం శోచనీయమన్నారు. ఈ రాష్ట్రంలో గత రెండు సంవత్సరాలుగా ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు ఒక రూపాయి అయినా సంపద సృష్టించాడా అని ఆయన ప్రశ్నించారు. ఆర్టీసీని ప్రైవేటుపరం చేసి డబ్బులు దండుకొని సొంత ఆస్తులు పెంచుకోవడానికి చేసుకునే ప్రయత్నమే తప్ప రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్న ఆకాంక్ష ఏ మాత్రం కూటమి ప్రభుత్వంలో పాలకులకు లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రికార్డ్ సృష్టిస్తే చంద్రబాబు నాయుడు పరిపాలన చేతకాక ఆర్టీసీని ప్రభుత్వం నుంచి తీసివేసి ప్రైవేటీకరణ చేయాలనే నిర్ణయం తీసుకొంటుడడం వారి అసమర్థ రికార్డును వారే సృష్టించుకున్నట్లు ఉందన్నారు. రాష్ట్రంలో రోజురోజుకు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నప్పటికీ ధరలు అదుపు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏం మాత్రం చర్యలు తీసుకోకపోవడం కూడా ఈ అసమర్థ పాలనకు నిదర్శనంగా ఆయన పేర్కొన్నారు. ఆర్టీసీని ప్రైవేట్ పరం చేయాలనే ఆలోచన తక్షణమే విరమించుకొని, సంపద సృష్టించడానికి ఇతర మంచి మార్గాలను ఎన్నుకోవాలని కూటమి ప్రభుత్వ పాలకులకు ఆయన సూచించారు.

# అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినం సందర్భంగా ఎయిడ్స్ బాధితులకు నివాళి




**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మే 17:**పులివెందుల పట్టణంలోని మహాత్మా గాంధీ కూడలిలో అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినం సందర్భంగా ఆదివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో హెచ్ఐవీ/ఎయిడ్స్ కారణంగా మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుతూ కొవ్వొత్తులు వెలిగించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ హెచ్ఐవీ/ఎయిడ్స్ పై సమాజంలో ఇంకా అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఎయిడ్స్ బాధితులను వివక్షకు గురి చేయకుండా వారికి మానవత్వంతో సహకారం అందించాలని పిలుపునిచ్చారు. వ్యాధి నియంత్రణకు జాగ్రత్తలు, పరీక్షలు మరియు సమయానికి చికిత్స ఎంతో ముఖ్యమని తెలిపారు. అలాగే ఎయిడ్స్ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య, మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య, సీనియర్ అసిస్టెంట్ నరేష్, సీడీఎస్ మేనేజర్ వల్లి, టీబీ సూపర్ వైజర్ భాగ్యలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ నాయక్, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు తదితరులు పాల్గొని ఎయిడ్స్‌తో మృతి చెందిన వారిని స్మరించుకున్నారు.

# గల్ఫ్ బాధితురాలుకి అండగా నిలబడ్డ పవన్ కళ్యాణ్

**ఉప ముఖ్యమంత్రి చొరవతో సురక్షితంగా ఏపీకి వచ్చిన గల్ఫ్ బాధితురాలు.**

**సేనాని చెప్పాడంటే చేస్తాడు అని అంటున్నారు జనసేన పార్టీ నాయకులు.**




**వేంపల్లె మన జనప్రగతి మే 17 :-** పవన్ కళ్యాణ్ చొరవతో షహనాజ్ అనే బాధితురాలు గల్ఫ్ నుంచి సురక్షితంగా ఏపీకి చేరుకుందని జనసేన పార్టీ నాయకులు గోసుల ఆంజనేయులు అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం వేంపల్లి లో విలేకరులతో మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా వాల్మీకి పురానికి చెందిన షహనాజ్ అనే యువతి ఉపాధి కోసం బిడ్డలను వదిలి గల్ఫ్ కి వెళ్ళింది కానీ అక్కడ ఏజెంట్లు ఆమె కు అన్నం పెట్టకుండా నానా రకాల చిత్రహింసలు పెట్టారు అని అన్నారు. చిత్రహింసలు భరించలేని ఆమె వెంటనే సెల్ఫీ వీడియో ద్వారా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు మొర పెట్టుకుంది అని అన్నారు. వెంటనే ఉప ముఖ్యమంత్రి మస్కట్ లోని ఇండియన్ నెంబర్స్ అధికారులతో మాట్లాడే షహనాజును ఏజెంట్ల చర నుంచి విడిపించారు అని అన్నారు. మస్కట్ నుంచి విజయవాడకు చేరుకున్న ఆమెకు 30000 నగదు తో పాటు చీర ఇచ్చి బహుకరించి ఆమె స్వగ్రామానికి పంపారు అని అన్నారు. తనను తన కుటుంబం దగ్గరికి చేర్చిన పవన్ కళ్యాణ్ కు, స్థానిక ఎమ్మెల్యే కు సహనాజ్ కృతజ్ఞతలు తెలిపారు అన్నారు. ఇది మన సేనాని పవన్ కళ్యాణ్ ప్రతిభ అంటే ఏ కష్టంలో ఉన్న వ్యక్తి అయినా పవన్ కళ్యాణ్ కు మొరపెట్టుకుంటే ఆ పని కచ్చితంగా జరుగుతుంది అని జనసేన పార్టీ నాయకులు గోసల ఆంజనేయులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పెదబల్లి సుధీర్ రెడ్డి, శ్యామ్, దేవా, మనోజ్ రెడ్డి, నితీష్ రెడ్డి, నాగేంద్ర, చొక్కం. మల్లికార్జున, నంద, ఇడుపులపాయ జయచంద్ర, లక్ష్మణ్, థామస్, అంజి తదితరులు పాల్గొన్నారు.

# బెడుదూర్ వెంకటేశ్వర స్వామి కొండపైకి ప్రయాణం

**● భక్తులకు నరకప్రాయం! దెబ్బతిన్న మట్టి రోడ్డు..**

**● కదలలేని వాహనాలు స్వామివారి దర్శనానికి వెళ్లేందుకు భక్తుల తీవ్ర అవస్థలు**

**● కలెక్టర్ గారూ.. మాపై కాస్త కరుణ చూపించండి!**




**రైల్వే కొండాపురం మన జనప్రగతి మే 17:-**కడప జిల్లాకలియుగ వైకుంఠుడిగా, భక్తుల కోర్కెలు తీర్చే ప్రత్యక్ష దైవంగా కడప జిల్లా బేడుదూరు గ్రామంలోని కొండపై వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఎంతో ప్రసిద్ధి చెందింది. ప్రతినిత్యం, విశేష పర్వదినాల్లోనూ స్వామివారిని దర్శించుకోవడానికి వేలాది మంది భక్తులు ఈ కొండపైకి వస్తుంటారు. అయితే, ఆ దేవుడిని దర్శించుకోవడానికి భక్తులు పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీ కావు. కొండపైకి వెళ్లే రహదారి పూర్తిగా అద్వానంగా తయారవ్వడమే దీనికి ప్రధాన కారణం. వణుకుతున్న ప్రయాణం.. వర్ణనాతీతం భక్తుల కష్టాలుకొండపైకి వెళ్లే మార్గం కనీసం నడవడానికి కూడా వీల్లేకుండా రాళ్లు, రప్పలతో నిండిపోయింది. గ్రావెల్ కొట్టుకుపోయి కేవలం మట్టి రోడ్డు మాత్రమే మిగలడంతో, వాహనాలపై వెళ్లే వృద్ధులు, మహిళలు, చిన్న పిల్లలు తీవ్ర భయాందోళనల మధ్య ప్రయాణిస్తున్నారు. ప్రమాదకరంగా మారిన మట్టి రోడ్డు: సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో బైక్‌లపై వెళ్లే వారు తరచూ కిందపడి గాయాలపాలవుతున్నారు. కాలి నడకన వెళ్లే వారికీ తప్పని తిప్పలు: ముళ్ల పొదలు, పదునైన రాళ్ల మధ్య నడవలేక భక్తులు నరకయాతన అనుభవిస్తున్నారు. అత్యవసర సమయాల్లో కొండపైకి వాహనాలు వెళ్లడం గగనంగా మారింది. భక్తులు, గ్రామస్థులగ్రామీణ ప్రాంతాల్లోని దేవాలయాల అభివృద్ధిని పట్టించుకోవాల్సిన పాలకులు ఈ రోడ్డు వైపు కన్నెత్తి కూడా చూడకపోవడంపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భక్తుల భద్రతను దృష్ట్యా యుద్ధప్రాతిపదికన వెంటనే కొండపైకి గ్రావెల్ తరలించి, రోడ్డును సమం చేయాలి. దీనికోసం ఉపాధి హామీ పథకం పనులను ఉపయోగించుకోవాలి. అలాగే శాశ్వత బీటీ రోడ్డు న రోడ్డును మంజూరు చేయాలని కడప జిల్లా కలెక్టర్, రోడ్ల భవనాల శాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి, నిర్మాణం చేయాలని కోరుతున్నారు.

# ప్రొద్దుటూరును అసాంఘిక కార్యకలాపాల అడ్డాగా మార్చింది: వైసీపీ..ముక్తియార్ ధ్వజం




**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జన ప్రగతి మే 17:-**మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి చేస్తున్న ఆరోపణలు అవాస్తవాలని రాష్ట్ర షేక్ కార్పొరేషన్ ఛైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ఎస్. ముక్తియార్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ఆదివారం ప్రొద్దుటూరులోని తన నివాసంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, ఆయన కుమారుడు కొండారెడ్డి ఆధ్వర్యంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని రాచమల్లు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉచిత ఇసుక విధానం అమలులో ఉందని, అలాంటి పరిస్థితుల్లో ఇసుక అక్రమ రవాణా ఆరోపణలు చేయడం హాస్యాస్పదమన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే రాచమల్లు, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి ఇసుకను ఇతర రాష్ట్రాలకు తరలించి భారీగా సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. అదే సమయంలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని విమర్శించారు. చౌడూరు గ్రామ ఏటి లో అభివృద్ధి, పారిశ్రామికీకరణ కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంటే పెట్టుబడిదారులను భయపెట్టేలా వైసీపీ నాయకులు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. గత ప్రభుత్వంలో రాచమల్లు ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేర్చలేదని, "ఒక చేత్తో ఇంటి పట్టా మరో చేత్తో తాళం చెవి" అన్న జగనన్న కాలనీ హామీ ఏమైందని ప్రశ్నించారు. ప్రొద్దుటూరులో గతంలో వ్యవస్థలను తమ అదుపులో పెట్టుకుని అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మార్చిందీ వైసీపీ నాయకత్వమేనని ముక్తియార్ ఆరోపించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో అలాంటి పరిస్థితులు ఎక్కడా లేవన్నారు. మైదుకూరు రోడ్డు, కొర్రపాడు రోడ్డు విస్తరణ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని తెలిపారు. రానున్న ఎన్నికల్లో రాచమల్లుకు వైసీపీ టికెట్ వచ్చే అవకాశమే లేదని, వచ్చినా 50 వేల ఓట్ల తేడాతో ఓడిపోతారని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా వైసీపీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. టీడీపీ మాజీ ఇంచార్జ్ డాక్టర్ జి.వి. ప్రవీణ్ కుమార్ రెడ్డి పార్టీ ఎమ్మెల్యే, ఆయన కుటుంబంపై మీడియా ముందుకు వచ్చి విమర్శలు చేయడం సరికాదన్నారు. అసంతృప్తి ఉంటే పార్టీ వేదికల్లో చెప్పాలని సూచించారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి నిజాయితీని గుర్తించిన ముఖ్యమంత్రి ఆయనకు టికెట్ ఇచ్చారని గుర్తుచేశారు. ఈ సమావేశంలో మాజీ కౌన్సిలర్ బాబయ్య, టీడీపీ నాయకులు షబ్బీర్, ఖాదర్ వల్లీ, ఖలీల్, జనసేన నాయకుడు జిలానీ బాష తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ గెజిటెడ్ ఆఫీసర్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎం.డి.యూనస్ అలీ ఏకగ్రీవ నియామకం



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి మే 17 :-**ఆంధ్రప్రదేశ్ గెజిటెడ్ ఆఫీసర్స్ ఫోరం (ఏపిజివోఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో చీఫ్ బయోకెమిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.డి. యూనస్ అలీ ను నామినేట్ చేసినట్లు ఫోరం సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడిగా ఎం.డి.యూనస్ అలీ మాట్లాడుతూ...గెజిటెడ్ అధికారుల సేవా సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, సంక్షేమం మరియు పరిపాలనా వ్యవహారాల్లో సమర్థవంతమైన నాయకత్వాన్ని అందించాలనే లక్ష్యంతో ఈ నియామకం చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఎం.డి.యూనస్ అలీ తన సేవా కాలంలో నిబద్ధత, పారదర్శకత మరియు సేవాభావంతో ప్రత్యేక గుర్తింపు పొందారని సభ్యులు కొనియాడారు. ఆయన నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ గెజిటెడ్ ఆఫీసర్స్ ఫోరం మరింత బలోపేతమై, గెజిటెడ్ అధికారుల సంక్షేమం కోసం సమర్థవంతంగా పనిచేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన గెజిటెడ్ అధికారులు, సహచరులు మరియు మిత్రులు ఎం.డి. యూనస్ అలీ హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# ఉరవకొండ డిపో గేట్ మీటింగ్ విజయవంతం




**ఉరవకొండ మన జనప్రగతి మే 17:-** రాష్ట్ర కమిటీ పిలుపు మేరకుఆదివారం ఉరవకొండ డిపో వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్ ఘనంగా విజయవంతమైంది. ఈ కార్యక్రమానికి రీజనల్ సెక్రటరీ ఖ. కొండన్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వారితో పాటు డిపో సెక్రటరీ దీ. మాబు, డిపో ప్రెసిడెంట్ మురళీ నాయక్, సీసీస్ పీవీ శ్రీనివాస్, గ్యారేజ్ సెక్రటరీ శ్రీరాములు మరియు డిపో నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ సమావేశాన్ని జయప్రదం చేశారు

# నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్.

**- చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండండి.**



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి మే 17:-**కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జిల్లాలో నేరనియంత్రణ , శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలలో రౌడీ షీటర్లకు , నేరచరిత్ర గలవారికి ,చెడు నడత కలిగిన వ్యక్తులకు ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే తప్పనిసరిగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీసు అధికారులు హెచ్చరించారు.

# పోలీసుల సమర్థత బాధితులకు భరోసా

**● సామాన్యుల సంరక్షణకే ప్రాధాన్యత**

**● పులివెందుల అర్బన్ సీఐ శ్రీరాం**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మే 17:**బాధితులకు భరోసా కల్పించడంలో పోలీసుల సమర్థత వినియోగపడాలని, విధి నిర్వహణలో సామాన్యుల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని పులివెందుల అర్బన్ సీఐ శ్రీరాం పేర్కొన్నారు. ఆదివారం అర్బన్ స్టేషన్ నందు వివిధ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ స్టేషన్కు వచ్చినటువంటి ప్రజలతో అర్బన్ సీఐ శ్రీరామ్ ఎంతో సహనంతో సమస్యలు వింటూ బాధితులతో అదే విధంగా ప్రత్యర్థుల వివరణతో సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ ప్రజలు అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండి శాంతియుత వాతావరణం లో జీవనాన్ని కొనసాగించాలని, అసాంఘిక శక్తుల సమాచారాలను సామాజిక బాధ్యతతో పోలీస్ సిబ్బందికి తెలియజేసినప్పుడే సమాజంలో మంచి వాతావరణం ఏర్పడుతుందని అలాగే బాధితులకు భరోసా కల్పించడంలో పోలీస్ సిబ్బంది తమ సమర్థతను మరింత మెరుగుపరుచుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బాధిత ప్రజలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆంజనేయ స్వామి గుడిలో యువతులకు పసుపు, కుంకుమ పంపిణీ



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మే 17:**పులివెందుల నూతన ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివాహం కాని యువతులకు మంగళద్రవ్యాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ప్రముఖ దాత గుడిపాటి నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భూమిరెడ్డి ఉమాదేవి చేతుల మీదుగా యువతులకు పసుపు, కుంకుమలను అందజేశారు. యువతులకు త్వరగా వివాహాలు జరగాలని, వారు జీవితంలో స్థిరపడాలని ఆకాంక్షిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పూజా కార్యక్రమంలో స్థానిక భక్తులు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి...
తెలుగు దినపత్రిక
18 - 05 - 2026

# 20న మెడికల్ షాపుల బంద్‌కు మద్దతు




**హైదరాబాద్ మన జనప్రగతి మే 17:-** ఆన్లైన్ ద్వారా మెడిసిన్ విక్రయాలను, కార్పొరేట్ సంస్థల అధికడిస్కౌంట్లను వెంటనే నిలిపి వేయాలని అంబర్ పేట కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 20వ తేదీన దేశ వ్యాప్త మెడికల్ షాపుల బందు కు వారు పూర్తి మద్దతు ప్రకటించారు. బంద్ పోస్టర్ ను ఆదివారం వారు ఆవిష్కరించారు.వారు మాట్లాడుతూ... చిన్న, స్వతంత్ర కెమిస్టుల జీవనాధారాన్ని దెబ్బతీస్తున్న ఆన్ లైన్ మెడిసిన్ ల విక్రయాలు, కార్పొరేట్ సంస్థల అధిక డిస్కౌంట్లను నిలిపివేయాలన్నారు. నకిలీ, నాణ్యతలేని మందుల విక్రయలను పూర్తిగా అరికట్టాలని, ఇది ప్రజారోగ్య భద్రతకు అత్యంత అవసరమని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని వారు కోరారు.


# చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండండి

**- కడప టూ టౌన్ సి.ఐ శ్రీహరి**



**కడప మన జనప్రగతి మే 17:-** జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు నేరనియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా కడప టూ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు, నేరచరిత్ర గలవారికి కడప ఇంచార్జి డి.ఎస్పీ ఇ. బాలస్వామి రెడ్డి పర్యవేక్షణ లో కడప టూ టౌన్ సి.ఐ శ్రీహరి ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు.సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు.చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే తప్పనిసరిగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కడప టూ టౌన్ సి.ఐ శ్రీహరి హెచ్చరించారు.

# తెలంగాణ ఎంసెట్‌లో మైదుకూరు విద్యార్థి త్రిలోక్ రాయల్‌కు 3,921వ ర్యాంక్



**మైదుకూరు మన జనప్రగతి మే 17:-**తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన ఎంసెట్ (తెలంగాణ ఎం సెట్)ఫలితాలలో వైఎస్సార్ కడప జిల్లా మైదుకూరు పరిధిలోని సాయినాథపురానికి చెందిన బొమ్మిశెట్టి త్రిలోక్ రాయల్ ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఇంజనీరింగ్ విభాగంలో ఆయన 3,921వ ర్యాంక్ సాధించారు.త్రిలోక్ రాయల్ తండ్రి బొమ్మిశెట్టి మోహన్ ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ కాగా, తల్లి లక్ష్మీ రమణమ్మ గృహిణి.ఈ సందర్భంగా త్రిలోక్ రాయల్ మాట్లాడుతూ ఈ ఏడాది తెలంగాణ ఎంసెట్ ప్రశ్నపత్రం అత్యంత కఠినంగా వచ్చినప్పటికీ మంచి ర్యాంక్ సాధించడం సంతోషంగా ఉందన్నారు. తన ప్రధాన దృష్టి అంతా ప్రస్తుతం జేఈఈ అడ్వాన్స్ పరీక్షపైనే ఉందని పేర్కొన్నారు.ఇటీవలే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్మీడియట్ ఫలితాలలో కూడా తాను 97% మార్కులతో, పదవ తరగతిలో 561 మార్కులతో ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన తెలిపారు. భవిష్యత్తులో ఒక మంచి ఇంజనీర్‌గా ఎదిగి సమాజానికి సేవ చేయడమే తన ప్రధాన ధ్యేయమని త్రిలోక్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఎంసెట్‌లో మంచి ర్యాంక్ సాధించిన త్రిలోక్‌ను పలువురు ప్రముఖులు, స్థానికులు అభినందించారు.

# రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కాపాడిన బొమ్మనహాల్ పోలీసులు

● ఖాకీ'ల్లో దేవుళ్లను చూసిన బాధితుడు



**బొమ్మనహాల్ మన జనప్రగతి మే 17:-**రోడ్డు ప్రమాదంలో చిక్కుకున్న యువకుడి కాలు విరగకుండా రేకుల కట్టర్‌తో కట్ చేసి చాకచక్యంగా రక్షించిన ఏఎస్ఐ విజయ్ మరియు సిబ్బంది.ప్రత్యేక అభినందనలు తెలిపిన జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్..ఎక్కడైనా ప్రమాదం జరిగి కాలు, చేయి విరిగితే డాక్టర్లు ఆపరేషన్ చేసి ప్రాణాలు కాపాడి దేవుళ్లవుతారు.కానీ బొమ్మనహాల్ పోలీసులు అంతకంటే ముందే రంగంలోకి దిగి,ప్రమాద తీవ్రతను గుర్తించి, అవయవాలు విరిగిపోకుండా అత్యంత వేగంగా స్పందించి ఒక వాహనదారుని ప్రాణాలు కాపాడారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి తాము కూడా ప్రజల ప్రాణాలను కాపాడే దేవుళ్లమే అని నిరూపించారు వివరాల్లోకి వెళ్తే ఆదివారం మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో బొమ్మనహాల్ మండలం శ్రీనివాస్ క్యాంప్ దగ్గర ఒక ట్రాక్టరు ఇంజను మాత్రమే వేసుకొని వెళ్తున్న వాహనదారున్ని,కంకర లోడ్‌తో వెళుతున్న ఒక టిప్పరు లారీ వెనుక నుండి బలంగా ఢీకొట్టింది. ఈ రోడ్డు ప్రమాదంలో ట్రాక్టరు కుడి వైపు పెద్ద టైరు భాగం పూర్తిగా నుజ్జునుజ్జు అయ్యింది. ట్రాక్టర్ డ్రైవర్ బోయ కుళ్ళాయి స్వామి 22 సం తండ్రి: సుంకన్న, చంద్రగిరి, బొమ్మనహాల్ మండలం) యొక్క కుడి కాలు నుజ్జునుజ్జు అయిన వాహన ఇనుప రేకుల మధ్య గట్టిగా చిక్కుకుపోయింది.ప్రమాదం జరిగిన విషయం తెలిసిన వెంటనే బొమ్మనహాల్ ఏఎస్ఐ విజయ్ మరియు సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రుడిని బయటకు తీయడానికి ప్రయత్నించగా,కాలు గట్టిగా ఇరుక్కుపోయి ఉండటం గమనించారు.బలవంతంగా లాగితే కాలు విరిగిపోయే ప్రమాదం ఉందని గ్రహించిన పోలీసులు,క్షణం కూడా ఆలస్యం చేయకుండా ఉద్దేహల్ నుండి ప్రత్యేకంగా 'రేకుల కట్టర్' తెప్పించారు. అత్యంత జాగ్రత్తగా ట్రాక్టరు బ్రేకు లివరు,టైరు పైభాగంలో ఉన్న ఐరన్ రేకును కట్ చేసి, డ్రైవరుకు ఎలాంటి అదనపు గాయాలు కాకుండా సురక్షితంగా బయటకు తీశారు.అనంతరం వెంటనే 108 అంబులెన్స్ ద్వారా ఆసుపత్రికి తరలించారు.**పోలీసుల అప్రమత్తత లేకుంటే.**..ఆ సమయంలో పోలీసులు అంత తెలివిగా వ్యవహరించకపోయినా, క్షతగాత్రుడిని వెంటనే అక్కడ నుండి తరలించకపోయినా హైవేపై మరో ప్రమాదం జరిగి ఉండేది. లేదా అప్పటికే ఇరుక్కుపోయిన కాలు పూర్తిగా విరిగిపోయే అవకాశం ఉండేది.ప్రాణాపాయ స్థితిలో ఉన్న యువకుడిని కాపాడి పోలీసులు నిజంగా 'డాక్టర్ల లాగా దేవుళ్లే' అనిపించుకున్నారు.ప్రజల ధన,మాన,ప్రాణాల రక్షణకు పోలీసులు ఎల్లవేళలా సంసిద్ధంగా ఉంటారనే దానికి ఈ ఘటనే నిదర్శనం. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించి, సమయస్ఫూర్తితో యువకుడి ప్రాణాలు కాపాడిన బొమ్మనహాల్ పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ పి.జగదీష్ ప్రత్యేకంగా అభినందించారు.పోలీసుల మానవత్వాన్ని,సేవానిరతిని స్థానిక ప్రజలు సైతం మెచ్చుకున్నారు.

# విద్యార్థుల విజయమే గురువులకు నిజమైన ఆనందం..!

● చాగలేరు పూర్వ ఉపాధ్యాయుల బృందం.

● చాగలేరు పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహణ

● గురువుల సత్కారం..జ్ఞాపకాలతో భావోద్వేగ క్షణాలు

● మృతి చెందిన స్నేహితులకు నివాళులు..సేవా కార్యక్రమాలకు సంకల్పం




**వేముల మన జనప్రగతి మే 17:-** వేముల మండల పరిధిలోని స్థానిక చాగలేరు గ్రామ జిల్లా ఉన్నత పాఠశాలలో 2003, 2004, 2005 సంవత్సరాల్లో పదవ తరగతి చదివిన పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత ఒకే వేదికపై కలుసుకున్న పూర్వవిద్యార్థులు ఆనందోత్సాహాలతో కార్యక్రమాన్ని నిర్వహిస్తూ పాత అనుబంధాలను మరింత బలపరుచుకున్నారు.ఈ సందర్భంగా పాఠశాల దశలో నేర్చుకున్న పాఠాలు,గురువుల బోధనలను స్మరించుకున్నారు.ఉపాధ్యాయులు నేడు మారుతున్న జీవనశైలి,పిల్లల భవిష్యత్తు,సమాజ పట్ల బాధ్యత వంటి అంశాలపై విలువైన సూచనలు చేశారు.జీవితంలో క్రమశిక్షణ,నీతి,సేవాభావం ఉంటేనే ఉన్నత స్థానాలను అధిరోహించగలమని విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు.పూర్వవిద్యార్థులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ గురువుల బోధనలు,శిక్షణ,అప్పటి కఠినమైన నియమాలు,సూచనలు,సలహాలను స్మరించుకున్నారు.అప్పట్లో అర్థం కాని గురువుల మాటల అసలు విలువ ఇప్పుడు తెలిసిందని,వారి ఆశీర్వాదాల వల్లనే తాము జీవితంలో స్థిరపడగలిగామని భావోద్వేగంతో తెలిపారు. గురువుల పట్ల కృతజ్ఞతాభావాన్ని వ్యక్తం చేస్తూ కొంతమంది విద్యార్థులు తమ అనుభవాలను పంచుకున్నారు.అదేవిధంగా,కాలం చెల్లిన ఉపాధ్యాయులను స్మరించుకుంటూ మౌనం పాటించారు.అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఉపాధ్యాయునికి దుశ్శాలువలు కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు.విద్యార్థులు సమాజంలో మంచి స్థానాలను సంపాదించడం చూసి గర్వంగా ఉందని, వారి విజయమే తమకు నిజమైన ఆనందమని ఉపాధ్యాయులు గర్వపడ్డారు.గురు-శిష్య బంధం ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతుందని వారు పేర్కొన్నారు.కార్యక్రమంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు పాఠశాల రోజులను, స్నేహితులతో గడిపిన మధుర క్షణాలను గుర్తుచేసుకుంటూ ఆనందభాష్పాలు పెట్టుకున్నారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందించడంతో పాటు, భవిష్యత్తులో విద్యార్థులకు ఉపయోగపడే విధంగా సేవా కార్యక్రమాలు చేపట్టాలని సంకల్పం వ్యక్తం చేశారు.గ్రామాభివృద్ధి,పాఠశాల అభివృద్ధి కోసం సమిష్టిగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రధానోపాధ్యాయులు అన్నపూర్ణ, కొండారెడ్డి,ప్రధాన ఉపాధ్యాయులు చంద్రమోహన్ రెడ్డి,సుబ్బారెడ్డి,శ్రీనివాసులు రెడ్డి,ఉపాధ్యాయులు ఆనందరావు, శివశంకర్ రెడ్డి,విజయేశ్వరి,వహీదా,పీఈటి శ్రీనివాసులు, ఉత్తమయ్య సతీమణి, గౌతమ్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి మరియు పూర్వవిద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి: డిఆర్ఓ మల్లికార్జునుడు



**కడప మన జనప్రగతి మే17:-** ఈ నెల 18 వ తేదీన జిల్లా కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు ప్రజలు వినియోగించుకోవాలని డి ఆర్ ఓ మల్లికార్జునుడు ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు.అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా,లేదా తమ ఫిర్యాదులకుసంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని విజ్ఞప్తి చేశారు.ఈ నెల 18 వతేదీన సోమవారం కలెక్టరేట్ లోని సభా భవన్ నందు ప్రజాసమస్యలపరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని,ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్ లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని,ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లాఅధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం లో తమ వివరాలతో పాటు వారి సమస్యలకుసంబంధించి అర్జీలను అంద జేయాలన్నారు.అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పునుతీసుకురావాలని సూచించారు.సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని,అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు,ఎండార్స్మెంట్ ను వాట్సప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలుపిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్విని యోగం చేసుకోవాలని కోరారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్య క్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామన్నారు.అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించుకోవచ్చునన్నారు **డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం** డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుండి ఉ.10 గంటల వరకు జరుగుతుందన్నారు.ప్రజలు 08562-244437 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునన్నారుప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్వో ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

● ఇందిరా నగర్‌లో అవగాహన కార్యక్రమంలో

చింతకొమ్మ దిన్నె సి.ఐ బాల మద్దిలేటి



**చింతకొమ్మ దిన్నె మన జనప్రగతి మే 17:-** జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు చింతకొమ్మ దిన్నె పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇందిరా నగర్ లో ఆదివారం సాయంత్రం గంజాయి, మట్కా బెట్టింగ్ మరియు జూదం వంటి సామాజిక చెడులపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు ఈ అక్రమ కార్యకలాపాల వల్ల కలిగే అనర్థాల గురించి చింతకొమ్మ దిన్నె సి.ఐ బాల మద్దిలేటి, సిబ్బంది వివరంగా తెలియజేశారు.గంజాయి వినియోగం, మట్కా బెట్టింగ్ మరియు జూదం వంటి అలవాట్లు వ్యక్తిగతంగా, కుటుంబ పరంగా మరియు సమాజానికి తీవ్ర హానికరమని తెలియజేస్తూ యువత ఈ దుష్ప్రవర్తనల నుండి దూరంగా ఉండాలని సూచించారు. అలాగే ఈ విధమైన అక్రమ కార్యకలాపాలలో పాల్గొనకూడదని కఠినంగా హెచ్చరించారు.స్థానికులు సహకరించి, భవిష్యత్తులో ఇటువంటి సామాజిక చెడులను నివారించడానికి కలిసి పనిచేస్తామని చింతకొమ్మ దిన్నె సి.ఐ బాల మద్దిలేటి కి హామీ ఇచ్చారు.

# మైనారిటీలకు కూటమి ప్రభుత్వం అండ

**- రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌కు తిరుపతిలో ఘన స్వాగతం**

**తిరుపతి మన జనప్రగతి మే 17 :-** రాష్ట్రంలోని ముస్లిం మైనారిటీలకు కూటమి ప్రభుత్వం అండగా ఉందని, ఈ ప్రభుత్వం మైనార్టీలకు ఆర్థికంగా రాజకీయంగా ఎదిగేందుకు దోహదపడుతోందని రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తక్ అహ్మద్ తెలిపారు. ఆయన ఆదివారం తిరుపతికి విచ్చేసిన సందర్భంగా టిడిపి రాష్ట్ర మైనారిటీ కార్యనిర్వాక కార్యదర్శి, తిరుపతి కో-ఆపరేటివ్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ షేక్ మహబూబ్ బాషా, నగరంలోని మైనార్టీలు ఘనంగా స్వాగతం పలికారు. పలమనేరు కు చెందిన టిడిపి మైనార్టీ సీనియర్ కార్యకర్త ఇంద్రజిత్తు హాస్పిటల్లో ఉండటంతో ఆయనను పరామర్శించారు. తెలుగుదేశం పార్టీ ఆయనకు ఆయన కుటుంబానికి ఎప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఆయనకు స్వాగతం పలికిన వారిలో టిడిపి మైనారిటీ మీడియా కోఆర్డినేటర్ అసురుద్దీన్, షాది మహల్ డైరెక్టర్ సర్వరుద్దీన్, ముస్లిం ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు నిజాముద్దీన్, అమీర్ బాబు పాల్గొని మహబూబ్ బాషా నేతృత్వంలో మౌలానా ముస్తఫా అహ్మద్ ను శాలువాతో ఘనంగా సత్కరించారు.



# ఘనంగా ముగిసిన రాయలసీమ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు

● క్రీడలతోనే మానసిక ఉల్లాసం,

క్రమశిక్షణ: ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి








**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మే 17:** పట్టణంలోని అంబకపల్లి సర్కిల్ వద్ద గల రాయలసీమ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో అత్యంత ఉత్సాహభరితంగా నిర్వహించిన రాయలసీమ ప్రీమియర్ లీగ్ అండర్-12, అండర్-14 క్రికెట్ టోర్నమెంట్ ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన జట్లకు, ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు శాసనమండలి సభ్యులు (ఎమ్మెల్సీ) భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై బహుమతులను ప్రదానం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లోని బాలల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి టోర్నమెంట్లు ఎంతగానో దోహదపడతాయన్నారు.చిన్న వయస్సు నుంచే క్రీడలపై మక్కువ పెంచుకోవడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం,క్రమశిక్షణ అలవడుతుందని పేర్కొన్నారు. రాయలసీమ క్రికెట్ అకాడమీ నిర్వాహకులు చిన్న పిల్లల కోసం ఆర్పీఎల్ లీగ్‌ను విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు.ఈ ముగింపు మరియు బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమంలో పులివెందుల మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తుగుట్ల రాఘవరెడ్డి, పులివెందుల అర్బన్ సీఐ శ్రీరామ్,క్రికెట్ అకాడమీ నిర్వాహకులు నిత్యానంద రెడ్డి,బొజ్జా మైసూరా రెడ్డి, తాళ్లపల్లి వెంకటేశ్వర రెడ్డి, జ్ఞానేశ్వర్ నాయుడు, అజమాతుల్లా పలువురు క్రీడాభిమానులు,క్రీడాకారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# రాయి పెద్ది వెంకట మహాన్యాస్‌కు అరుదైన గౌరవం



**చిట్వేలి మన జనప్రగతి మే 17:**-చిట్వేలి గ్రామానికి చెందిన రాయి పెద్ది వెంకట మహాన్యాస్ శర్మ (16)కు అరుదైన గౌరవం లభించింది. ఋగ్వేద స్మార్థంలో ఉత్తమ స్థానం పొందినందుకు బెంగుళూరులోని శ్రీ దత్తపీఠం పీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి ద్వారా ప్రశంసా పత్రం అందుకున్నట్లు మహాన్యాస్ తండ్రి సుబ్రహ్మణ్యం శర్మ తెలియజేశారు. గతంలో కంచి మఠం ఆధ్వర్యంలో తిరుపతి గ్రామీణ మండలం పెరుమాళ్ళపల్లి లో సుబ్రహ్మణ్యం, కృష్ణవేణి దంపతుల ఆధ్వర్యంలో గురువు గోపాల్ బట్టు ద్వారా వేద విద్యను అభ్యసించిన మహాన్యాస్ రఘువంశము, మూర్త దర్శనము, అశ్వలాయన గుహ్య సూత్రము, శాంతి కమలాకరం, ఉపనిషత్తు సంబంధిత యోగాధి క్రతువులపై ప్రతిభ చూపిన మహాన్యాస్ ను గణపతి సచ్చిదానంద స్వామి ఆశీర్వదించి అభినందన పత్రం అందజేశారు.

# కేశవరావు కమిటీ ఉద్యమకారులకు న్యాయం చేయాలి

● తెలంగాణ ఉద్యమకారుల ఫోరం డిమాండ్



**ఆత్మకూరు, మన జనప్రగతి మే 17:**-తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు డిమాండ్ చేశారు. ఆత్మకూరు మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షులు ఎండి బాబుమియా ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో జిల్లా ప్రధాన కార్యదర్శి ఇర్సడ్ల సదానందం మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం జీవో నెంబర్ 679 ద్వారా కేశవరావు ఆధ్వర్యంలో ఆరుగురు సభ్యులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయడం సంతోషకరమని, ఇందుకు ముఖ్యమంత్రి కి కృతజ్ఞతలు తెలుపుతున్నామని పేర్కొన్నారు. అయితే ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలుకు స్పష్టమైన విధివిధానాలు రూపొందించి, వాటికి ఖచ్చితమైన కాలపరిమితిని నిర్ణయించాలని కోరారు.గత రెండున్నర సంవత్సరాలుగా ప్రభుత్వం కాలయాపన చేస్తూ ఇప్పుడు కమిటీ ఏర్పాటు చేయడం ఒకవైపు సంతోషమే అయినప్పటికీ, కాలపరిమితి లేకుండా ఉద్యమకారులను మభ్యపెట్టే ప్రయత్నమా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. జూన్ 2వ తేదీలోపు కమిటీ తన నివేదిక సమర్పించేలా గడువు నిర్ణయించాలని డిమాండ్ చేశారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాటం చేసిన ప్రతి ఉద్యమకారుడికి న్యాయం జరగాలని, కేసులు లేని వారు కూడా ఎంతోమంది ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. అలాంటి వారి ఫోటోలు, పత్రికలలో వచ్చిన వార్తా కటింగ్‌లు, ప్రకటనలను కూడా ఆధారాలుగా పరిగణలోకి తీసుకునే అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి డొంక దువ్వ రాజయ్య, గ్రామ అధ్యక్షులు బలబద్ర కిషోర్, మంద రవి, భాష బోయిన సదానందం, సుధాకర్, వంగరి సమ్మయ్య, టేంకురాల రామారావు, నత్తి దేవేందర్, పెరుమళ్ళ స్వామి, కుక్కల జంపయ్య, కరివేద సాంబారెడ్డి, నాగేల్లి స్వామి, పెరుమళ్ళ ఇమాన్యుల్, పెరుమాండ్ల కొర్నెల్, వడ్డేపల్లి కోటయ్య, జాగిరపు లక్ష్మీనారాయణ, పాండవుల సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



## హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ కళాశాల (అటానమస్)లో

# వైభవంగా విద్యా వారోత్సవాల ముగింపు వేడుకలు









**హనుమకొండ, మన జనప్రగతి మే 17:** తెలంగాణ ప్రభుత్వ '99 రోజుల ప్రజా పాలన: ప్రగతి ప్రణాలిక' కార్యక్రమం కింద నిర్వహించిన విద్యా వారోత్సవాల (11 - 17 మే 2026) ముగింపు వేడుకలు హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ కళాశాల (అటానమస్)లో అత్యంత ఉత్సాహంగా, సాంస్కృతిక వైభవంతో జరిగాయి.ఈ కార్యక్రమం ఉత్సాహభరితమైన సాంస్కృతిక ప్రదర్శనలతో ప్రారంభమైంది. సాహిత్య క్లబ్ కన్వీనర్ డా. టి.ఎస్. ప్రవీణ్ కుమార్, కళాశాల విద్యార్థులతో శాస్త్రీయ, జానపద గీతాలను ప్రదర్శింపజేశారు. ప్రిన్సిపాల్ మరియు సిబ్బంది, జ్ఞాపికలు, సర్టిఫికెట్లు మరియు డా. టి.ఎస్. ప్రవీణ్ కుమార్ ప్రాయోజితం చేసిన నగదు బహుమతులతో ప్రదర్శకులను సత్కరించారు.ప్రతిభావంతురాలైన యువ విద్యార్థిని సాయి రిషి అలీనా, తన అద్భుతమైన శాస్త్రీయ నృత్య ప్రదర్శనతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసి ఈ కార్యక్రమానికి మరింత శోభను చేకూర్చింది. ప్రిన్సిపాల్ ఆమె అసాధారణ ప్రతిభను ఎంతగానో ప్రశంసించి శాలువా, జ్ఞాపిక, సర్టిఫికెట్ మరియు నగదు బహుమతితో సత్కరించారు.డా. ఎన్.ఆర్.సి.హెచ్. శ్రీకాంత్ (ఆంగ్ల అసిస్టెంట్ ప్రొఫెసర్ & మీూజూ కోఆర్డినేటర్) ప్రారంభోపన్యాసం చేసి, ప్రముఖులను వేదికపైకి సాదరంగా ఆహ్వానించారు ప్రొఫెసర్ జి. శ్రీనివాస్, ప్రిన్సిపాల్; కె. రాజనీలత, వైస్ ప్రిన్సిపాల్; ప్రొఫెసర్ డి. రాజశేఖర్, వైస్ ప్రిన్సిపాల్; ప్రొఫెసర్ ఎ. శ్రీనాథ్, IQAC కోఆర్డినేటర్; డా. టి.ఎస్. ప్రవీణ్ కుమార్, సాహిత్య మరియు సాంస్కృతిక క్లబ్ కన్వీనర్; శ్రీ ఎం. రవి కుమార్, స్టాఫ్ సెక్రటరీ; మరియు డా. జి. శశికాంత్, క్రీడలు & ఆటల కన్వీనర్.ప్రొఫెసర్ జి. శ్రీనివాస్, ప్రిన్సిపాల్, ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. తన అధ్యక్షోపన్యాసంలో, ఏడు రోజుల పాటు జరిగిన విద్యా వారోత్సవాల కార్యక్రమాలలో సిబ్బంది చూపిన అద్భుతమైన సహకారం, చురుకైన భాగస్వామ్యం,నిబద్ధతను ఆయన అభినందించారు. తెలంగాణ కళాశాల విద్య కమిషనర్ , హైదరాబాద్ వారి మార్గదర్శకాల ప్రకారం నిర్వహించిన 7 రోజుల కార్యక్రమాలపై ఆంగ్ల విభాగ అధిపతి మరియు IQAC కోఆర్డినేటర్ అయిన ప్రొఫెసర్ ఎ. శ్రీనాథ్ ఒక సంక్షిప్త నివేదికను సమర్పించారు. శ్రీ ఎం. రవికుమార్ గారు CSR నిధుల దాతలైన హైదరాబాద్‌కు చెందిన ఆర్.ఎం. మోటార్స్ లీగల్ అడ్వైజర్ శ్రీ సి.హెచ్. రమేష్ బాబు గారిని మరియు హనుమకొండకు చెందిన ఏ.ఆర్. మోటార్స్ కు చెందిన శ్రీ మహమ్మద్ హల్లిం గారిని పరిచయం చేశారు. ప్రిన్సిపాల్ మరియు సిబ్బంది ఇద్దరు దాతలను జ్ఞాపికలతో సత్కరించి, వారికి ఘనంగా స్వాగతం పలికారు.క్రీడలు & ఆటల కన్వీనర్ డా. జి. శశికాంత్ గారు కళాశాల జాతీయ స్థాయి అథ్లెట్లను సత్కరించారు. లైనక్స్‌లో MOOCS స్వయం ప్లస్ కోర్సును విజయవంతంగా పూర్తి చేసిన ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రిన్సిపాల్ గారు సర్టిఫికెట్లను కూడా అందజేశారు.ఈ కార్యక్రమాన్ని అధ్యాపక బృందం, విభాగాధిపతులు మరియు కళాశాలలోని వివిధ సెల్‌ల కన్వీనర్లు వీక్షించారు. గౌరవనీయ తెలంగాణ ప్రభుత్వం మరియు హైదరాబాద్ కళాశాల విద్య కమిషనర్ వారి 'ప్రజా పాలన: ప్రగతి ప్రణాలిక' చొరవ కింద విద్యా వారోత్సవాలను ఘనవిజయంగా నిర్వహించడానికి ఉత్సాహంగా పాల్గొన్న తల్లిదండ్రులు మరియు విద్యార్థులందరినీ ప్రిన్సిపాల్ అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.డా. టి.ఎస్. ప్రవీణ్ కుమార్, ఆంగ్ల అసోసియేట్ ప్రొఫెసర్ సాహిత్య క్లబ్ కన్వీనర్ గారు ప్రతిపాదించిన వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

# ఘనంగా విద్యా వారోత్సల ముగింపు సమావేశం



ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి సంతోష్ కుమార్‌ను అధ్యాపకులు సన్మానిస్తున్న దృశ్యం



ప్రొఫెసర్ ఎల్ మల్లయ్యను సన్మానించిన ప్రిన్సిపల్ మరియు అధ్యాపక బృందం



టీచర్ ఉద్యోగం సాధించిన పూర్వ విద్యార్థి సాయి తేజను అధ్యాపక బృందం సన్మానిస్తున్న దృశ్యం




విద్యా వారోత్సవాల ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ బి సంతోష్ కుమార్

**పరకాల,మన జనప్రగతి మే 17:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరకాలలో ఈనెల 11 నుండి 17 వరకు నిర్వహించిన విద్య వారోత్సవాల ముగింపు సమావేశం కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి. సంతోష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. సంతోష్ కుమార్ మాట్లాడుతూ విద్య సాధికారికతను సాధించేందుకు విద్యార్థులలో నైపుణ్యాలను, సాంకేతిక పరిజ్ఞానం, డిజిటల్ లెర్నింగ్, పెంపొందించేందుకు , పట్టణ,పల్లె విద్య అంతరాలను తగ్గించేందుకు అందరికీ సమాన అవకాశాలు కల్పించేందుకు గాను ప్రభుత్వం విద్యా వారోత్సవాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. విద్యా వారోత్సవాలను. విజయవంతం కావడానికి కృషిచేసిన అధ్యాపకులను అభినందించారు. అకాడమిక్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎన్. మల్లయ్య వారం రోజులపాటు కళాశాలలో నిర్వహించిన విద్యా కార్యక్రమాల గురించి వివరించడం జరిగింది. ప్లేస్మెంట్ సెల్ కన్వీనర్ ఆర్ ఈశ్వరయ్య మాట్లాడుతూ ప్రపంచాన్ని మార్చగలిగే శక్తి విద్యకు ఉందని , మనిషికి మూడవ కన్ను విద్య అని, అందుకనే విద్యార్థులు ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగాలు సాధించి దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. అత్యుత్తమ ప్రతిభ, నైపుణ్యం కనబరిచిన ప్రొఫెసర్లను మరియు విద్యార్థులను సన్మానించడం జరిగింది. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి.సంతోష్ కుమార్ ను, బెస్ట్ టీచర్ అవార్డు సాధించిన కళాశాల చరిత్ర విభాగాధిపతి ప్రొఫెసర్ ఎన్.మల్లయ్య ను, కళాశాల అడ్మిషన్ల పెంపుదలకు కృషిచేసిన కంప్యూటర్ సైన్స్ విభాగ అధ్యాపకులు డాక్టర్ డి సంజయ్ కుమార్ ను, టీచర్ ఉద్యోగం సాధించిన పూర్వ విద్యార్థి సాయితేజను , క్రీడలలో నైపుణ్యం సాధించిన మహేష్ ను ఘనంగా సన్మానించడం జరిగింది. విద్యార్థుల యొక్క సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో ఐ క్యు ఏ సి కోఆర్డినేటర్ డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ ఆడెపు రమేష్, డాక్టర్ కల్పన, డాక్టర్ భీమ్ రావు, బి. మహేంద్రరావు, డాక్టర్ కే జగదీష్ బాబు, ఏం సమ్మయ్య, ఎస్ రాజశ్రీ మరియు ఆఫీస్ సిబ్బంది వంశీ, కృష్ణ పాల్గొన్నారు.

# గ్రామాలకు తరలండి కార్యక్రమాన్ని విజయవంతం చేస్తాం : ఎంఆర్పీఎస్ నాయకులు



## ఉప్పల్‌లో ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ మరియు అనుబంధ సంఘాల జిల్లా కార్యవర్గ సమావేశం

**ఉప్పల్, మన జనప్రగతి మే 17:** ఉప్పల్ కేంద్రంలోని రాజీవ్ కళ్యాణ మండపంలో మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లా ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ మరియు అనుబంధ సంఘాల కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి మేడ్చల్ జిల్లా ఎంఆర్పీఎస్ అధ్యక్షుడు పంగ ప్రణయ్ కుమార్ మాదిగ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా ఇన్‌చార్జ్ తిప్పారపు లక్ష్మణ్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశపాక రామ్‌చందర్ మాదిగ, జాతీయ కళామండలి అధ్యక్షుడు ఎన్‌వై అశోక్ మాదిగ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు గ్రామాలకు తరలండి కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా చేపట్టాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లోని విద్యార్థులను చైతన్యపరిచి సాధించిన వర్గీకరణ రిజర్వేషన్ ఫలాలు అందరికీ చేరేలా కృషి చేయాలని సూచించారు. గ్రామస్థాయిలో ఉద్యమాన్ని బలోపేతం చేసి మందకృష్ణ మాదిగ కార్యాచరణను విజయవంతం చేసే దిశగా మేడ్చల్ జిల్లా కమిటీ ముందుండి పనిచేస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తిని శివ, తోకట్ట నరేష్ మాదిగ, ఎంఎస్పీ సీనియర్ నాయకులు ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోరపాక అంజి మాదిగ, మాదిగ యువసేన అధ్యక్షుడు దబిలిపురం పరశురాం, మహిళా సమైక్య అధ్యక్షురాలు సలోమి, బండారి సాయి, మైసగళ్ల శివ మాదిగ, మేడ సంజీవ్, జీడిపల్లి శివ మాదిగ, రామకృష్ణ మాదిగ, బాలకృష్ణ మాదిగ, ఎంఎస్ఎఫ్ జిల్లా నాయకులు దండు శివకృష్ణ మాదిగ, మాదిగ జర్నలిస్టు ఫోరం ఇడపాక సురేష్ మాదిగ, ఏళ్ల సంతోష్ కుమార్, వంశీ, యోగేష్, బొడ్డు శివ తదితరులు పాల్గొన్నారు.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి...
తెలుగు దినపత్రిక
18 - 05 - 2026

## జిల్లా, డివిజన్, మండల స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక: జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్



**తిరుపతి మన జనప్రగతి మే 17:** –నేడు సోమవారం జిల్లా, డివిజన్, మండల స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల స్థాయిలో తహశీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో ఆర్డీవో కార్యాలయాల్లో పి జీ ఆర్ ఎస్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మండల కార్యాలయంలో తహశీల్దారులు, ఎంపీడీవోలు, ఇతర మండల అధికారులు, ఆర్డీవో కార్యాలయాల్లో రెవిన్యూ డివిజనల్ అధికారి, ఇతర డివిజనల్ అధికారులు పాల్గొని వినితలను స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. మండల, రెవెన్యూ డివిజన్ స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలకు సంబంధించి ప్రజలు తమ అర్జీలను మండల కార్యాలయాలు లేక రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో తమ వినతులను సమర్పించవచ్చని తెలిపారు. ఎండ తీవ్రత ఎక్కువ ఉన్న దృష్ట్యా అత్యవసరమైతే తప్ప అర్జీదారులు వినతులు సమర్పించడానికి వ్యయ ప్రయాసలకు ఓర్చి జిల్లా కలెక్టరేట్ కు రావద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండల రెవెన్యూ డివిజన్ స్థాయిలో నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని స్వయంగా పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సాప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినోత్సవాన్ని విజయవంతం




**తిరుపతి మన జనప్రగతి మే 17:-** అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం జిల్లా కేంద్రమైన తిరుపతి లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బాలకృష్ణనాయక్ జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి అధికారి డాక్టర్ శైలజ ఉమ్మడి జిల్లాల ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రామ్ అధికారి కోటి రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతి డిఎం హెచ్ ఓ కార్యాలయం నుండి సాయంత్రం 6 గంటలకు క్యాండిల్ లైట్ కార్యక్రమం కొవ్వొత్తులు వెలిగించి మౌన ర్యాలీగా నిర్వహించారు ఎయిడ్స్ కారణంగా మరణించిన వారి ఆత్మశాంతి కోసం మౌనం పాటించి నివాళులు అర్పించనున్నట్లు పేర్కొన్నారు.ప్రతి సంవత్సరం మే మూడవ ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా జరుగుతోందన్నారు. కార్యక్రమానికి జిల్లా వైద్య అధికారులు, వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేశారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ వైద్యశాలలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రుల్లో కూడా అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు.

## హెచ్ఐవి బాధితులకు భరోసా ఇవ్వాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లక్ష్మీ నరసయ్య




**మదనపల్లి మన జనప్రగతి మే 17:-** హెచ్ఐవి బాధితులకు భరోసా కల్పించాలని, వారిపట్ల ఎలాంటి వివక్ష చూపరాదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లక్ష్మీ నరసయ్య అన్నారు. అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్రం మదనపల్లి జిల్లా ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లక్ష్మీ నరసయ్య జెండా ఊపి ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఆస్పత్రి నుంచి బెంగళూరు బస్టాండ్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. హెచ్ఐవి బాధితులు అధైర్యపడవద్దని, ఏఆర్టి మందులు క్రమం తప్పకుండా వాడితే జీవితకాలాన్ని పెంచుకోవచ్చని తెలిపారు.కడప, అన్నమయ్య జిల్లాల ఎయిడ్స్ నియంత్రణ మండలి క్లస్టర్ మేనేజర్ భాస్కర్ వేంపల్లి మాట్లాడుతూ.. “మేము గుర్తుంచుకుంటాం.. మేము అవగాహనతో ముందుకు వెళ్తాం.. మేము చర్య తీసుకుంటాం” అనే ఈ ఏడాది నినాదాన్ని వివరించారు. ఐసీటీసీ కేంద్రాల ద్వారా కౌన్సెలింగ్, ఏఆర్టి కేంద్రాల్లో ఉచిత మందుల పంపిణీ కొనసాగుతున్నట్లు తెలిపారు.అనంతరం హెచ్ఐవి కారణంగా మృతి చెందిన వారిని స్మరించుకుంటూ కొవ్వొత్తులు వెలిగించి, మౌనం పాటించి నివాళులర్పించారు. బెంగళూరు బస్టాండ్ వద్ద మానవహారంగా నిలబడి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, కౌన్సిలర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పాజిటివ్ నెట్‌వర్క్ సభ్యులు పాల్గొన్నారు.

## నెల్లూరులో సామాన్యుడిలా మంత్రి నారాయణ

- మోదీ, బాబు బాటలో ప్రోటోకాల్‌కు స్వస్తి
- 52.5 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన మంత్రి నారాయణ
- గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసింది
- నెల్లూరును రాష్ట్రంలోనే ‘రోల్ మోడల్‘గా తీర్చిదిద్దుతాం: మంత్రి నారాయణ






**నెల్లూరు మన జనప్రగతి మే 17:-** ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు బాటలో నడుస్తూ మంత్రి నారాయణ నెల్లూరులో కాన్వాయి, ప్రోటోకాల్ హంగులు లేకుండా సాదాసీదాగా ఒకే వాహనంలో పర్యటించి సామాన్యుడిలా ప్రజలతో మమేకమయ్యారు. అదివారం 3వ డివిజన్ సాదావారి పాలెంలో 24 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ డ్రైన్ పనులకు ఆయన శంకుస్థాపన చేసారు.సాదావారిపాలెం లో వీధి వీధి తిరుగుతూ స్థానికులను ఆప్యాయంగా పలకరించిన మంత్రి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆత్మకూరు బస్టాండు వద్ద 28.5 లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డును ప్రారంభించారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు.దాతల సహకారంతో కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను వీఆర్‌సీ తరహాలో ఆధునీకరిస్తూ, పేద పిల్లలకు విద్యను ఆస్తిగా ఇచ్చే గొప్ప కార్యక్రమాన్ని చేపట్టామని పేర్కొన్నారు.. నెల్లూరులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పూర్తి చేసి దోమలు లేని నగరంగా మారుస్తామని, కాలువల ఆధునీకరణ ద్వారా నగరానికి ముంపు ముప్పు తప్పిస్తామని హామీ ఇచ్చారు.గత ప్రభుత్వం అవకతవకలకు పాల్పడి,అస్తవ్యస్త పాలనతో పరిశ్రమలను వెనక్కి పంపేసి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పూర్తిగా చిన్నాభిన్నం చేసిందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పరిశ్రమల స్థాపనతోనే అభివృద్ధి సాధ్యమనే నిజాన్ని గత పాలకులు విస్మరించారని, అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు, యువనేత లోకేష్ పరిశ్రమల స్థాపనపై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు.దేశంలోకి వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో ఏకంగా 25 శాతం పెట్టుబడులను ఆంధ్రప్రదేశ్‌కే తీసుకువచ్చారని వెల్లడించారు. ఇప్పుడిప్పుడే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతోందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ కచ్చితంగా నెరవేరుస్తామని పునరుద్ఘాటించారు. ప్రస్తుతం నెల్లూరులో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని, భవిష్యత్తులో ఈ నగరాన్ని రాష్ట్రానికే రోల్ మోడల్‌గా నిలుపుతామని పేర్కొన్నారు.అనంతరం మంత్రి నారాయణ జేమ్స్ గార్డెన్ లో ఇటీవలే ప్రారంభించిన భాస్కర్ ఆర్థోపెడిక్ ఆసుపత్రిని సందర్శించారు.అక్కడ ఏర్పాటు చేసిన అధునాతన వైద్య పరికరాలను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్, మేయర్ సుజాత అశోక్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్,మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ, మాజీ జెడ్పిటిసి విజేత రెడ్డి, రంగనాథ స్వామి ఆలయ చైర్మన్ లెక్కల వెంక రెడ్డి,3వ డివిజన్ కో–క్లస్టర్ శైలజ,ప్రెసిడెంట్ విజయమ్మ,,వైస్ ప్రెసిడెంట్ గోవర్ధన్,యూనిట్ ఇన్‌చార్జ్ గొట్టిపాటి కృష్ణ,45వ డివిజన్ ప్రెసిడెంట్ సుజన్,క్లస్టర్ ఇంచార్జ్ యశ్వంత్,కో–క్లస్టర్ ఇంచార్జ్ డాక్టర్ పోకల రవి, నాయకులుజడ్. శ్రీనివాసులు రెడ్డి , మహేష్ స్థానిక టిడిపి ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## యువతకు డీఎస్పీ హెచ్చరిక..!




**అన్నమయ్య జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి మే 17:-** రాయచోటి పట్టణ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్తు కోసం కృషి చేయాలని డీఎస్పీ కృష్ణమోహన్ సూచించారు. ఆదివారం రాయచోటిలోని శ్రీ దీప బ్లడ్ బ్యాంక్‌లో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం యువ కేరటం ట్రస్ట్ డైరెక్టర్ వినయ్ కుమార్ 25వ జన్మదినోత్సవం సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇటీవల యువతలో పెరుగుతున్న ప్రమాదకర బైక్ స్టంట్లు, మత్తు పదార్థాల వినియోగంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ప్రభావంతో కొంతమంది యువకులు రోడ్లపై నిర్లక్ష్యంగా బైక్ స్టంట్లు చేస్తూ తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను ప్రమాదంలోకి నెడుతున్నారని హెచ్చరించారు. కొద్ది క్షణాల సరదా కోసం కుటుంబాలను దుఃఖంలో ముంచే పరిస్థితులు తలెత్తకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు.తల్లిదండ్రులు ఎంతో కష్టపడి పిల్లలను చదివిస్తుంటే, చెడు అలవాట్లతో వారి ఆశలను వమ్ము చేయకూడదన్నారు. మత్తు పదార్థాలకు బానిసవడం వల్ల యువత తమ భవిష్యత్తును తామే నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టి ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని, మంచి ఉద్యోగాలు సాధించి కుటుంబానికి గౌరవం తీసుకురావాలని సూచించారు.సోషల్ మీడియా ప్రభావానికి లోనై తప్పుడు మార్గాల్లోకి వెళ్లకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఇటీవల రాయచోటిలో బైక్ స్టంట్లు, అల్లరి చర్యలకు పాల్పడిన కొంతమంది యువకులను పోలీసులు పట్టుకుని, వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతమైతే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రతిభా జూనియర్ కళాశాల అధినేత శివగంగిరెడ్డి, పలువురు యువకులు, రక్తదాతలు పాల్గొన్నారు.

## ప్రైవేట్ టీచర్లను అడ్మిషన్ల కోసం వీధుల్లో తిప్పడం దారుణం




**అన్నమయ్య జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి మే 17:-** రాష్ట్రంలోని ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యను పూర్తిగా వ్యాపారంగా మార్చి, ఉపాధ్యాయులను బానిసల్లా ఉపయోగిస్తున్నాయని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. అంకన్న తీవ్రంగా విమర్శించారు. ఆదివారం రాయచోటిలోని డైట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన టీచర్లను అడ్మిషన్లు, ఫీజుల వసూళ్ల కోసం ఇంటింటికీ తిప్పడం దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. “టీచర్లు చదువు చెప్పాలా..? లేక అడ్మిషన్ల కోసం ప్రచారం చేయాలా..?” అంటూ ప్రశ్నించారు.కొన్ని ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు టీచర్లకు నిర్దిష్టంగా అడ్మిషన్ టార్గెట్లు విధిస్తూ, వాటిని పూర్తి చేయకపోతే జీతాలు నిలిపివేయడం, ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరించడం అత్యంత అన్యాయమన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు పని చేయించుకొని కనీస గౌరవం కూడా ఇవ్వకపోవడం అమానుషమని అన్నారు.తల్లిదండ్రుల నుంచి లక్షల రూపాయలు ఫీజుల పేరుతో వసూలు చేస్తూ, మరోవైపు టీచర్లను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు జరుగుతున్నప్పటికీ విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సిగ్గుచేటని విమర్శించారు.వెంటనే ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు,ముట్టడులు చేపడతామని హెచ్చరించారు.

## వికసితభారత్ బిల్డథాన్ - 2025 విజేతలైన చిట్వేలి విద్యార్థులు

**చిట్వేలి మన జనప్రగతి మే 17:-** వికసిత భారత్–2047 లక్ష్యాలకు అనుగుణంగా ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్, మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్, అటల్ ఇన్నోవేషన్ మిషన్ వారు సంయుక్తంగా నిర్వహించిన దేశవ్యాప్త ప్రోటోటైప్ మోడల్ రూపకల్పన పోటీలలో చిట్వేలి పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులైన పి.భవ్య, ఈశ్వరి,గాయత్రి, స్వప్న అభివృద్ధి చేసిన వ్యర్థ ప్లాస్టిక్ సీసాలకు రాగి పొర పూత అతికించి 3డి రాగి సీసాలుగా మార్పిడి అనే ప్రాజెక్ట్ ద్వారా ఆంధ్ర ప్రదేశ్ నుంచి ఎంపికైంది. ఈ విద్యార్థులకి కేంద్ర ప్రభుత్వం వారు పది వేల రూపాయలు బహుమతిగా ప్రకటించారని అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ సుబ్రహ్మణ్యం, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బి.దుర్గరాజు మాట్లాడుతూ ఇదివరకే భారత ప్రభుత్వ పేటెంట్ కార్యాలయం చెన్నై బ్రాంచ్ ఇదే ప్రోటో టైప్ మోడల్ కి పేటెంట్ ను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో




సృజనాత్మకత, ఆవిష్కరణలు, శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం పాఠశాల స్థాయిలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను మెడల్స్ తో అభినందించారు. ప్రాజెక్ట్ గైడ్ టీచర్ శివ నారాయణ గౌడ్ మాట్లాడుతూ వికసిత్ భారత్ కార్యక్రమం ద్వారా విద్యార్థులను భవిష్యత్తు భారత నిర్మాణంలో భాగస్వాములుగా తీర్చిదిద్దుతూ పాఠశాల స్థాయిలోనే ఆవిష్కరణలు, విజ్ఞానం, నాయకత్వ లక్షణాలు పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను మరియు గైడ్ టీచర్ శివ నారాయణ గౌడ్ ను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174